ప్రజాశక్తి
విశాఖపట్నం
ఆదివారం
జనవరి 07
2018
12 పేజీలు



అచ్యుతాపురంలో నిర్వహిస్తున్న భారీ ప్రదర్శన

రసాయన పరిశ్రమలతో

దెబ్బతింటున్న మత్స్యకారుల ఉపాధి

- ★ రైతుల పంటకు లభించని మద్దతు ధర
- ★ పెట్టుబడిదారులకు రాయితీలిచ్చి ప్రజలపై భారాలు
- ★ సిపిఎం బహిరంగ సభలో హేమలత
- ★ అచ్యుతాపురంలో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

తీరప్రాంతంలో పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమలత అన్నారు. సముద్రంలో చేపల సంపద తగ్గిపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం 22వ మహాసభల సందర్భంగా అచ్యుతాపురం జంక్షన్లో పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాధం అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వల్ల వివిధ తరగతుల ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం చేసిన పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని సరిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. చేసిన కూలి పనులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మిడ్డేమీల్స్ తదితర స్కీంలో పనిచేస్తున్న మహిళలను వర్కర్లుగా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. రిటైర్మెంట్ సదుపాయలు కూడా వర్తింపజేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. ప్రజల జీవన పరిస్థితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు.


వేదికపై అభివాదం చేస్తున్న హేమలత, నర్సింగరావు, బాబూరావు, లోకనాథం, బాలకృష్ణ, వెంకన్న, కోటేశ్వరరావు, అప్పలరాజు, అప్పారావు, ఎం. అప్పలరాజు తదితరులు

దేశంలో 57 మంది వద్ద వున్న ఆస్థి, 70 శాతం ప్రజల ఆస్థితో సమానమన్నారు. ఇది దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు అద్దం పడుతోందన్నారు. విద్య, వైద్యం వ్యాపారమయవుతున్న పరిస్థితుల్లో పేద, సామాన్యులకు అందుబాటులో లేకుండాపోతున్నాయన్నారు. సంపదను సృష్టించే కార్మికులు, కష్టజీవులు, ఆ సంపదను కొల్లగొట్టే విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పులు పాలవుతున్నారని తెలిపారు. మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతున్నాయి తప్ప రైతులు పండించే పంటలకు మద్దతు ధర లభించకపోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న హేమలత



12లో

దేశం స్వయం సమృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థల కీలకపాత్ర

'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలప్ విశాఖ' పుస్తకావిష్కరణలో హేమలత


3లో

చలి కుంపటి రాజుకుని వృద్ధురాలి సజీవ దహనం

సంఘటనా స్థలాన్ని పోలీసు అధికారుల పరిశీలన


2లో

జన్మభూమిలో కొనసాగుతున్న నిలదీతల పర్వం

సాగునీటి సౌకర్యం కల్పించాలని రావికమతం మండలం కొమిరలో రైతుల ఆందోళన

నిర్లక్ష్యంపై కేసు

- ◆ ఇద్దరు జిల్లా అధికారులపై అట్రాసిటీ కేసులు
- ◆ ఎ1గా డిడి, ఎ2గా జిల్లా కలెక్టర్
- ◆ సెక్షన్ల మార్పుతో పాటు ఆలస్యంపై ప్రత్యేక కోర్టు మండిపాటు
- ◆ హైకోర్టును ఆశ్రయించనున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి, జిల్లా పరిషత్తు

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితురాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం రావడంలో ఆలస్యం జరిగింది. ఆలస్యానికి కారణమైన సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు డి.వి.రమణమూర్తి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లను బాధ్యులను చేస్తూ బాధితరాలు కోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు ఇద్దరు అధికారులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించింది. దీంతో ఎంవిపి పోలీసులు ఈ నెల 3న ఇద్దరు అధికారులపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

నగరానికి చెందిన దళిత యువతి 2016లో ఒక యువకుని చేతిలో మోసపోయింది. ఈ క్రమంలోనే సదరు యువతి తాను ప్రేమ పేరిట మోసిపోయాననీ, తనకు ప్రభుత్వం సాయం చేయాలని అర్జీ పెట్టుకుంది. నిబంధనలు ప్రకారం మోసపోయిన దళిత, గిరిజన యువతులకు ప్రభుత్వం కేవలం మూడు రోజుల వ్యవధిలోనే తక్షణ ఆర్థికసాయం అందజేయాలి. ఈ మేరకు బాధితురాలికి ప్రభుత్వం నుంచి రూ. 3.75 లక్షల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. దాని కోసం ఆమె సాంఘిక సంక్షేమ శాఖకు

మిగతా 4లో..

ఆలస్యం చేయలేదు



2016లో ఎంవిపి పోలీస్‌స్టేషన్‌లో బాధిత ఎస్‌టి మహిళ అట్రాసిటీ కేసు పెట్టారు. పోలీసుల నమోదు చేసిన కేసు సెక్షన్ల ఆధారంగా ప్రతి సందర్భంలోనూ అందుకు తగ్గట్టుగా స్పందించడం జరిగింది. రెండు విడతల్లో రూ.3,75,000 బాధితురాలికి పరిహారం చెల్లించాం. మొదట విడత సెప్టెంబర్ 2016లో రూ.25వేలు, డిసెంబర్‌లో రూ.3,50,000 ఇచ్చాం. నిబంధనల ప్రకారమే పరిహారం అందించాం. ఎక్కడా ఆలస్యం చేయలేదు.

- డి.వి.రమణమూర్తి,
ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమశాఖ,.

'జన్మభూమి' గ్రామసభల్లో

కొనసాగుతున్న నిలదీతల పర్వం



కొమిరలో అధికారులను అడ్డగించిన రైతులు

సాగునీటి సమస్యపై రైతన్నల ఆందోళన

రావికమతం : ఆయకట్టు రైతుల సాగునీటి సమస్య పరిష్కారమయ్యేంత వరకు గ్రామంలోకి రావద్దని రైతులు గ్రామశివారులో బైఠాయించి, జన్మభూమి అధికారులను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.రామకృష్ణ అక్కడకు చేరుకుని, జన్మభూమిని అడ్డుకోవడం సరికాదని, ఇలా చేస్తే రైతులపై కేసు నమోదు చేయకతప్పదని హెచ్చరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమపై కేసులు పెట్టినా, అరెస్ట్ చేసినా వెనక్కుతగ్గేది లేదని, ప్రాణాలు ఇచ్చైనా తమ గ్రామానికి పెద్దేరు రిజర్వాయర్ నీరు తెచ్చుకొంటామని ఎదురు దాడికి దిగారు. దీర్ఘకాలిక ఈ సమస్యకు ఇరిగేషన్ అధికారులు సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. తమవద్ద సమాచారం లేదని వారు అధికారులు చేతులెత్తేయడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. తహశీల్దార్ సిద్ధయ్య , ఎస్ఐ రామకృష్ణ రైతులను వారించే ప్రయత్నం చేసినా, రైతులు శాంతించకపోడంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో రైతులను ఫోనులో మాట్లాడించి, వారి నుంచి సమస్య పరిష్కారానికి హామీనివ్వడంతో వెనక్కుతగ్గారు. తర్వాత మొక్కుబడిగా జన్మభూమి కొనసాగించారు. గుమ్మాళ్లపాడు, కవగుంట, చినపాచిల గ్రామసభల్లో ప్రజలు పలుసమస్యపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయప్రకాష్, తహశీల్దార్ సిద్దయ్య, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులు, పోలీసులతో రైతుల వాగ్వాదం

పథకాలన్నీ జన్మభూమి కమిటీలకేనా..?

చోడవరం : అంకుపాలెం, శ్రీరామపట్నం, బెన్నవోలు, గౌరీపట్నం జన్మభూమి గ్రామసభల్లో పింఛన్లు, ఇళ్లు తదితర సంక్షేమ పథకాలపై ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేని ఈ సభలు నిర్వహించడమెందుకని గౌరీపట్నంలో స్థానికులు నిలదీశారు. ఎన్నోఏళ్లుగా వికలాంగ, వృద్ధాప్య పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నా ఫలితం లేదని వాపోయారు. వచ్చిన పింఛన్లు, ఇతర పథకాలను అధికార పార్టీ, జన్మభూమి కమిటీ సభ్యులే కాజేస్తున్నారని, దీంతో అధికారులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని ఎంపిటిసి సభ్యులు కోన చంద్రరావు ఎంపిడిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెవిఎస్ రవి, ఎంపిడిఒ జివి చిట్టిరాజులతో పాటు వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.



గౌరీపట్నంలో ఎంపిడిఒను నిలదీస్తున్న ఎంపిటిసి

ప్రయోజనం లేని జన్మభూమి ఎందుకు?



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

కె.కోటపాడు : పేదలకు ఉపయోగపడని జన్మభూమి ఎందుకని వారాడ గ్రామ సర్పంచ్ లెక్కల నాగ విజయలక్ష్మి ఆరోపించారు. శనివారం వారడ సంతపాలెం, వారాడ, గొట్లాం, శృంగవరం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. వారాడ సభలో ఆమె మాట్లాడుతూ 2015-16 నుంచి నేటివరకు తొమ్మిది మంది వితంతువులు పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకున్నా, వారిలో ఏ ఒక్కరికీ ఫింఛను ఇవ్వలేదన్నారు. గ్రామంలో అర్హులైన 21 మంది ఉంటే, ప్రస్తుతం ఆరుగురికి మాత్రమే పింఛన్లు కేటాయించారని, వీటిని ఎవరికి ఇవ్వాలని ప్రశ్నించారు. ప్రజల మధ్య గొడవ పెట్టి, నేతలను అబాసుపాలు చేయడానికి అరకొర పింఛన్లు ఇస్తున్నారని మండిపడ్డారు. శృంగవరం జన్మభూమి సభలో రాష్ట్ర బిసి సెల్ సభ్యులు కొటాన ఈశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిపి సబ్బవరపు పుష్పవతి, వి.సంతపాలెం సర్పంచ్ వేచలపు దేముడమ్మ, జిసిసి ఎండి రవిప్రకాష్, సాక్షరభారత్ డిడి డుంబు, ఎడిఇ రామచంద్రరాజు, ప్రత్యేక అధికారి డివి రమణమూర్తి, ఎంపిడిఒ సిహెచ్ సుబ్బలక్ష్మి, తహశీల్దార్ బివి రాణి, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలను అడ్డుకున్న సర్పంచ్‌లు

దేవరాపల్లి : బోయిలకింతాడ, కలిగొట్ల జన్మభూమి గ్రామసభలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు బూరె బాబూరావు, గొర్రెపోటు సుధారాణి సుమారు 2 గంటల పాటు ప్రారంభం కాకుండా అడ్డుకొన్నారు. బి.కింతాడ సర్పంచ్ తన వర్గీయులతో కలిసి రైతు రుణమాఫీ సక్రమంగా చేయలేదని, ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచ్‌నైన తనకు తెలియకుండానే అధికార పార్టీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీనికి అధికారులు సమాధానం చెప్పి తీరాలని నిలదీశారు. జన్మభూమి కమిటీ అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల అమలులో టిడిపి నేతలు ప్రొటోకాల్ పాటించడం లేదని, ఇళ్లు, పింఛన్లు మంజూరు సమాచారం తనకు తెలియనీయడం లేదని కలిగొట్ల గ్రామసభలో సర్పంచ్ గొర్రెపోటు సుధారాణి నిలదీశారు. బి.కింతాడ, కలిగొట్లల్లో ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు చెలరేగాయి. ఎస్ఐ పి.నర్సింహమూర్తి కలుగజేసుకుని సముదాయించడంతో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, జెడ్‌పిటిసి గాలి వరలక్ష్మి, ప్రత్యేక అధికారి జి.మహాలక్ష్మి, ఎంపిడిఒ డి.చంద్రశేఖర్, తహశీల్దార్ వైఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కలిగొట్లలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ సుధారాణి

మరుగుదొడ్ల అక్రమార్కులను జైలులో పెట్టిస్తా : ఎమ్మెల్యే కిడారి



ఎమ్మెల్యే కిడారి, అధికారులను నిలదీస్తున్న గిరిజనులు.

డుంబ్రిగుడ : మరుగుదొడ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హెచ్చరించారు. శనివారం లైగండ, గుంటసీమలో జన్మభూమి గ్రామసభలో మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం అందరికీ మరుగుదొడ్లను నిర్మిస్తుందన్నారు. వాటి నిర్మాణ బాధ్యతలు తీసుకున్న విఆర్‌పిలు, అధికారులు, కాంట్రాక్టర్‌లు, సప్లయర్స్ అసంపూర్తిగా నిర్మించి వదిలేయడం దుర్మార్గమన్నారు. మంచినీటి పథకాల నిర్మాణాల్లో కూడా నాణ్యత లేకుండా చేసి నిధులను స్వాహా చేస్తున్నారని చెప్పారు.

సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీత

అనంతరం రేషన్‌కార్డులు, మరుగుదొడ్ల బిల్లులు వంటి సమస్యలపై ఎమ్మెల్యే, అధికారులను స్థానిక గిరిజనులు నిలదీశారు. గుంటసీమ పంచాయతీలో మరుగుదొడ్లు నిర్మించకుండా బిల్లులు స్వాహా చేశారని, నిర్మించిన వాటికి వెంటనే బిల్లులు అందించాలని ఎమ్మెల్యే కిడారి, ఎపిడి లచ్చన్నను లబ్ధిదారులు నిలదీశారు. స్వాహా చేసిన బిల్లులను రికవరీ చేసి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఉపాధి జాబ్ కార్డుల కొరకు గుంటసీమ విఆర్‌పి రూ.20 తీసుకుంటున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. గత జన్మభూమిలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా నేటికీ మంజూరు చేయలేదని లైగండలో పలువురు నిలదీశారు.. అనంతరం బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదంటూ ఆ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపిటిసిల ఆధ్వర్యాన తీర్మానం చేసి ఆ పంచాయతీ గిరిజనులు ఎమ్మెల్యేకు తీర్మానపత్రాన్ని అందించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని గుంటసీమ స్కూల్ కాంప్లెక్సు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి లచ్చన్న, తహశీల్దార్ బాబూసుందరం, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మీనాకుమారి, వైస్ ఎంపిపి పాపారావు, టిడిపి మండల అధ్యక్షులు టి.సుబ్బారావు, ఎం.స్వామి, వివిధ శాఖల అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు పంపిణీ

కొత్తకోట : కొత్తకోట జన్మభూమిలో కొత్తగా మంజూరైన 80 రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ కోట నీలవేణితో కలసి ఎంపిపి డి.రామకృష్ణ శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎంపిపి రామకృష్ణ మాట్లాడుతూ విభజన తర్వాత రాష్ట్రం ఆర్థికలోటుతో సతమతమౌతున్నా ఇచ్చిన హామీల అమలుకు, సంక్షేమపథకాలకు ఎటువంటి లోటురాకుండా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ నాగమణి, నాయకులు కోట గోవిందరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో రేషన్ కార్డులు అందజేస్తున్న ఎంపిపి , సర్పంచ్

పోలీస్ బందోబస్తుతో జన్మభూమి సభలు

కొయ్యూరు : మారుమూల మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతాలైన మఠం భీమవరం, యు.చాకిపాలెం పంచాయతీ కేంద్రాల్లో పోలీసుల బందోబస్తు నడుమ శనివారం ప్రశాంతంగా జన్మభూమి కార్యక్రమం జరిగింది. మండల ప్రత్యేక అధికారిణి పార్వతమ్మ, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ ఇమ్మాన్యుయల్‌ల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రానికి సుమారు 80, 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పంచాయతీ కేంద్రాల్లో జన్మభూమి కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హాజరయ్యారు.

ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని కోరారు. మన్యం అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు, సిఐ ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులకు సమస్యల స్వాగతం

ముంచంగిపుట్టు : మండలంలోని సుజనకోట, జర్రెల పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాల్లో అధికారులకు సమస్యలు స్వాగతం పలికాయి. సుజనకోటలో తాగునీరు, పింఛన్, ఉపాధి పనులు, స్మశాన వాటిక స్థలం కేటాయింపు, వంటి సమస్యలపై అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. అనంతరం ఎంపిపి పద్మ చేతులమీదుగా రైతులకు రుణపత్రాలను అందించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.



సమస్యలపై వినతులు అందిస్తున్న గిరిజనులు

జర్రెల గ్రామసభలో వైసిపి మండల అధ్యక్షులు చిట్టిబాబు సమస్యలపై అధికారులను నిలదీశారు.కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు రుక్మంధర్, వి.లలిత, ఎంపిటిసిలు సీతమ్మ, ఎం.చిన్నమ్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

జెడ్‌పిహెచ్ స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రత



మొక్కలు నాటుతున్న జాజుల రమేష్

అనకాపల్లి : సత్యనారాయణపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో యువతా మేలుకో ఆధ్వర్యంలో పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకులు జాజుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌పి చంద్రశేఖర్, ఫణీంద్ర ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురుస్కరించుకొని వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత నడవాని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాని, గణేష్, మహేష్, రాజు, శివ, వరుణ్‌తేజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమిలో ఆటల పోటీలు ప్రారంభం

కశింకోట : కశింకోట డిపిఎన్ బాలుర పాఠశాలలో జన్మభూమి మాఊరులో భాగంగా కశింకోట మండల స్థాయి ఆటల పోటీలు శనివారం జరిగాయి. ఈ పోటీలను ఎంపిపి పంచదార్ల లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా ముందుండాలన్నారు. ఆటలు మానశిక ఉల్లాసం కూడా ఇస్తుందన్నారు. ముందుగా కబడ్డీ పోటీలు ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపోళ్ల నాగేశ్వరి, స్కూల్ హెచ్ఎం ఎ శ్రీధర్‌రెడ్డి, పిడి పి గోపీనాథ్, సహ ఉపాధ్యాయులు పివి సుబ్బారావు పాల్గొన్నారు.

సిపిఎస్ విధానం రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - వద్దాది

అన్యాయమైన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బుచ్చెయ్యపేట మండల ఎపిటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.అయ్యన్న, బి.దేముడుబాబు ఇచ్చిన పిలుపుమేరకు జన్మభూమి గ్రామసభల్లో ఉపాధ్యాయులు వినతిపత్రాలను అందించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి మంచి నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. కార్యక్రమాల్లో దుర్గాప్రసాద్, జిటికె మూర్తి, శ్రీను, మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలియో బాధితులకు 'ప్రశాంతి' విద్యార్థుల విరాళం

ప్రజాశక్తి- అనకాపల్లి

పట్టణంలోని ప్రశాంతి నికేతన్ ఎంవివిఎస్ మూర్తి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పోలియో బాధితుల సహాయార్థం శనివారం రూ.34వేల రూపాయల విరాళాలన్ని అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు బుద్ద రమణాజీకి, కాలేజీ కరస్పాండెంట్ డివి శ్రీనివాసరావు, విద్యార్థులు సేకరించిన చెక్కును ఇచ్చారు. ఈ విరాళాన్ని పోలీయో ఫండ్‌కు పంపిస్తామని రమణాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సిబ్బంది యాజమాన్యం పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - వద్దాది

బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట జెడ్‌పి హైస్కూల్‌లో అంబేద్కర్ ఇండియన్ మిషన్ (ఎఐఎం) ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపకులుపివి సునీల్‌కుమార్ స్ఫూర్తితో పేద విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఆసక్తిగలవారు 5 బయోడేటా ఫారాలు, 5 ఫోటోలతో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని కోరారు.

సిపిఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కొత్తకోట : పాడేరులో జరిగే సిపిఐ జిల్లా మహసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివలంక కొండలరావు కోరారు. శనివారం కొత్తకోటలో సిపిఐ మండల కార్యదర్శి జి.జోగిరాజుతో కలసి పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9,10,11తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభల్లో పార్టీ పునర్నిర్మాణం, పార్టీకార్యదర్శి నియామకం వంటి కీలక చర్యలతో పాటు ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు గుమ్ముడు సత్యనారాయణ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా... సినిమా



అనకాపల్లిలో సినిమాలు

పట్టణంలో సినిమాలు...

రామచంద్ర	ది కంత్రీస్
రాజా	ఒక్క క్షణం
సత్యనారాయణ	హలో
శ్రీ సత్యనారాయణ స్క్రీన్ 2-	జుమాంజి
షిర్డిసాయి	నీ ప్రేమే నా ప్రాణం
పర్తిసాయి	ఎంసిఎ
వెంకటేశ్వర	ప్రాజెక్టు జెడ్

చోడవరం

సాయిలక్ష్మి	- ఎంసిఎ
శ్రీసాయిలక్ష్మి	- హలో
సాయిసిరిమేక్స్	- దేవిశ్రీప్రసాద్
పూర్ణ	-మళ్లీరావా..

నర్సీపట్నం


శ్రీకన్య :	: జవాన్
కన్య:	: లచ్చి
కన్యమినీ:	: రాజా ది గ్రేట్
సాయిశ్రీకన్య:	: 10
రాజు మూవీమేక్స్:	: సీత రాముని కోసం
బంగార్రాజు	: సప్తగిరి ఎల్ఎల్‌బి

దత్తత గ్రామాల్లో పారిశుధ్యంపై సర్వే

ప్రజాశక్తి త- పరవాడ

అగనంపూడి స్థానిక గొన్నా పాలిటెక్నికల్ కళాశాల సెక్రటరీ జిబి నాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమం భాగంగా మండలంలోని 5 దత్తత గ్రామాలలో పారిశుధ్యంపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రామ్‌నళినిదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి వెంకటేశ్వరరావు పాల్గొని వారి ఆధ్వర్యంలో పలు విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహించారు. కళాశాల అధ్యాపక బృందం పాల్గొని గ్రామంలో ప్రజలలకు జన్మభూమి మాఊరు కార్యక్రమం పట్ల అవగాహన కల్పించారు.

అనకాపల్లి బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్ యార్డుకు శనివారం 21,873 బెల్లం దిమ్మలు దిగుమతి అయ్యాయి. 100 కేజీలు చొప్పున ధరలు ఇలా ఉన్నాయి. (రూ.)

	గరిష్టం	కనిష్టం
మొదటి రకం	3450	2745
రెండవ రకం :	3160	2,700
మూడో రకం :	2,790	2500

కలప ఆదాయ లక్ష్యం రూ.5 కోట్లు

గొలుగొండ : టేకు, వెదురు కలప ద్వారా ఈ ఏడాది రూ.5 కోట్లు ఆదాయం వచ్చేవిధంగా లక్ష్యం నిర్ణయించుకున్నామని నర్సీపట్నం డిఎఫ్ఓ జి.శేఖరబాబు అన్నారు. శనివారం గొలుగొండ కలప డిపోలో జరిగిన వేలంపాటకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజను పరిధిలో పలు ప్లాంటేషన్లులోని టేకు చెట్లలో కోతదశకు వచ్చిన వాటిని తొలగించి గొలుగొండ, చింతపల్లి డిపోలకు తరలిస్తున్నామన్నారు. గొలుగొండ డిపోలో ప్రతినెల 6, 22వ తేదీలలో టేకు, వెదురు కలపకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ మహమ్మద్ షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి సజీవ దహనం



కాలిపోయిన అప్పలనరసమ్మ

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్

నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వద్దురాలు మతి చెందింది. నర్సీపట్నం ఎస్ఐ టి.శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెట్టుపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్ల అప్పలనర్స అలియాస్ అప్పలరాజు (62) ఒంటరిగా తాటాకుల పాకలో నివసిస్తుందన్నారు. ఈ మధ్యకాలంలో ఆమె తరచూ పడిపోవడం వలన కాళ్ళకి చేతులకి గాయాలు కావడంతో ఆమెకు ఆపరేషన్ జరిగినట్లు చెప్పారు. వృద్ధాప్యం వలన ఎక్కడికి వెళ్లలేకపోవడంతో అన్ని సదుపాయాలను తన కుమారుడే చూసుకుంటున్నాడని తెలిపారు. 4వ తేదీన తాపీ పనికి వెళ్లగా 5వ తేదీ రాత్రి మతురాలు అప్పలనర్సమ్మ చలికి ఏర్పాటు చేసుకున్న కుంపటిలోని మంటలు ఏర్పడడంతో మంచం పైన ఉండి కాలిపోయింది. అర్ధరాత్రి కావడంతో గ్రామస్తులు అందరూ నిద్రపోవడం వలన ఎవరూ గమనించక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. సంఘటనా స్థలానికి ఎఎస్‌పి ఆరిఫ్ ఆఫీజ్, నర్సీపట్నం రూరల్ ఎస్ రేవతమ్మ, పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



ఫైల్‌ఫోటో

78 కేజీల గంజాయి పట్టివేత



వాహనం నుంచి బయటకు తీస్తున్న గంజాయి

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని స్థానిక పోలీసులు శనివారం గంజాయితో వస్తున్న స్కార్పియో కారును పట్టుకొని 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ సిఐ సిహెచ్‌వివిఎస్ ప్రసాద్ తెలిపారు. దుంబ్రీగూడ నుండి గంజాయిని తరలిస్తున్నారన్న వార్త ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ డిఎస్‌పి దేవప్రసాద్‌కు రావడంతో ఆ వాహనాన్ని వెంబడించామని చెప్పారు. అక్కడ తప్పించుకోవడంతో సబ్బవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బీట్‌లో ఉన్న సబ్బవరం పోలీసులు వాహనాన్ని పట్టుకున్నామన్నారు. అయితే ఈ వాహనంలో కమ్మిడి గోవంద (45), కమ్మిడి నిర్మల (38)లు తన కుమారుడు ఆరేళ్ల బాలుడు దొరికినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టుబడ్డ ఇసుక లారీ

ప్రజాశక్తి - కోటవురట్ల

మండలంలోని రాజుపేట గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఇసుక లారీపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

స్వశక్తితో ముందుకెళ్తేనే గుర్తింపు సాధ్యం

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

విద్యార్థులు స్వశక్తితో ముందుకెళ్లి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానికడైట్ కళాశాలలో డైట్ ఉత్సవ్ 2018 ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సివిల్ ఇంజినీరరింగ్ ల్యాబ్, ట్రాన్స్‌పోర్టేషన్ ల్యాబ్‌ను మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలేజీల సంఖ్య ఎక్కువవ్వయ్యాయని, ప్రభుత్వం కూడా విద్య కోసం నిధులు కేటాయిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ డైట్ ఇంజనీరింగ్ కళాశాల మాదిరి దాడి వీరభద్రరావు మెడికల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పిల్లలు విద్యను అభ్యసించే విధంగా ఎంసెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత స్వర్గీయ ఎన్‌టిఆర్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నకర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫిసర్ అమరేంద్ర, డీన్ డాక్టర్ కె రామారావు, శాస్త్రవేత్త డిఎల్ శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ ప్రభాకరరావు, డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరి

ప్రజాశక్తి-రోలుగుంట

బహిరంగ మల విసర్జన రహితంగా గ్రామం ఉండాలంటే ఇంటిలో తప్పనిసరిగా మరుగుదొడ్డు నిర్మించి వినియోగించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత అన్నారు. శనివారం గ్రామంలో అన్ని వార్డుల్లో మరుగుదొడ్డు నిర్మించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

నిర్లక్ష్యంపై కేసు

దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తులో భాగంగా పోలీసుల వద్ద తీసుకున్న ఎఫ్ఐఆర్, చార్జీసీటు, ట్రైయిల్ కాపీలను సాంఘిక సంక్షేమ శాఖకు అందించాలి. ఈ కాపీల్లో ఉన్న సెక్షన్ల తీవ్రతను బట్టి సంక్షేమ శాఖ పరిహారం నిమిత్తం ప్రభుత్వానికి నివేధిస్తుంది. అయితే పోలీసులు కేసు స్థాయిని తగ్గించి రాయడం, దఫల వారీగా కేసులు పెట్టించడంతో ఆమెకు పరిహారం రావడం ఆలస్యమైంది. ఈ విషయంపై సదరు యువతి తనకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఆలస్యం చేయడమే కాకుండా, సెక్షన్లను తారుమారు చేశారంటూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం బాధ్యులైన అధికారులపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డిడి. రమణమూర్తిని ఎ1గా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఏ2గా చేర్చుతూ ఎంవిపి పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదయ్యింది. 2016లో యువతి ఇచ్చిన ఫిర్యాదు ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్ట్, సిఆర్పీసీ 156 క్లాజ్ 3 కింద ఎంవిపి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తిగా నగదు బాధితురాలికి అందించినప్పటికీ కోర్టులో కేసు వేయడంపై కలెక్టర్ హైకోర్టును ఆశ్రయించనున్నారు.

కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తల విజయం

ఏడాది కాల పరిమితితో రెన్యువల్ - దీక్షలు విరమణ

ప్రజాశక్తి-పాడేరు

ఏడాది కాల పరిమితితో నియామక ఉత్తర్వులను పాడేరు డిఎంఅండ్‌హెచ్ఒ గురునాధరావు శనివారం అందించడంలో కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తలు దీక్షను విరమించారు. ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. తొలగించిన 95 మంది ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ 17 రోజులుగా ఐటిడిఎ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఆరోగ్య కార్యకర్తల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్టు నియామక



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న అప్పలనర్స తదితరులు

ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తల మిగిలిన డిమాండ్‌ల సాధనకు సైతం అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్య, ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కార్యదర్శి శెట్టి నాగరాజు మాట్లాడుతూ దీక్షకు మద్దతు తెలిపిన రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజా, విద్యార్థి సంఘం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎల్.సుందరరావు, వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారుడు కె.లక్ష్మణరావు, ఎస్.బాలయ్య, మహేష్‌పాత్రుడు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామారావు అందరికీ ఆదర్శం

సంతాప సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజాశక్తిలో విలేకరిగా, డివిజన్ ఇన్‌ఛార్జిగా అంకితభావం, నిబద్ధతతో పనిచేసిన కీర్తిశేషులు జన్ని రామారావు అందరికీ ఆదర్శం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు అన్నారు. ఈనెల ఒకటో తేదీన హతాన్మరణం చెందిన రామారావు సంతాప సభను ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తికి ప్రకటనల సేకరణలో పలాస డివిజన్‌ను రామారావు అగ్రస్థానంలో నిలిపారని చెప్పారు. విలేకరులను ప్రోత్సాహిస్తూ, పనిలో భాగస్వామ్యం కావడం ద్వారానే ఇది సాధించగలిగారన్నారు. విప్లవోద్యమాలకు అంకితమైనందునే అన్ని రంగాల్లోనూ ఆయన రాణించగలిగారని కొనియాడారు. రామారావు ఒరవడిని అందరూ అందిపుచ్చుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామారావు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. ప్రజాశక్తిలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగిని కోల్పోవడం సంస్థకు తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేవారు. అందరితో సత్సంబంధాలను కొనసాగిస్తూ వృత్తిలో బాగా రాణించారని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు సత్తారు భాస్కరరావు మాట్లాడుతూ విలేకరులకు పని అప్పగించడం, పని బాధ్యతలు తీసుకోవడం రామారావుకు ఉన్న మంచి లక్షణాలని చెప్పారు. ఎడిషన్ సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఎ.సోమశేఖరరావు మాట్లాడుతూ రామారావులో ఉన్న అంకితభావం, సమయపాలన, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని పనిలో ముందుకు సాగాలన్నారు. తొలుత రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సభకు స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు స్వాగతం పలకగా, ఎడివిటి ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు వందన సమర్పణ చేశారు. సభలో ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామారావు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసు, తదితరులు

చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం

మత్స్యకారులను కించపరిచిన

వైసిపి రాష్ట్ర నేత, మాజీ మంత్రి వెంకటరమణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరడానికి వెళ్లిన మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి నాయకులు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపు ధోరణితో మాట్లాడటం సరికాదని, ఆయనకు తగిన బుద్ధి చెబుతామని వైసిపి రాష్ట్ర నేత, మాజీ మంత్రి మోపుదేవి వెంకటరమణ అన్నారు. మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 11వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని వెంకటరమణ శనివారం సందర్శించి మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు శ్రీకాకుళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ అన్ని విధాలా వెనుకబడిన మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని చెప్పారని, అదే విషయాన్ని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరడం తప్పా అని ప్రశ్నించారు. మత్స్యకారులను అవమానిస్తూ మాట్లాడిన చంద్రబాబు తీరును గుర్తించుకుని 2019 ఎన్నికల్లో తగిన తీర్పు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్‌రెడ్డి సినీ నటుడు అంబటి శ్రీను, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు గరికన గౌరి, బడే నరసింగరావు, గంటా పాపారావు, మూగి శ్రీనివాసరావు, మూగి శ్రీరామమూర్తి, కదిరి అప్పారావు, చెన్నాదాసు, కంటుముచ్చు తాతారావు, బుద్దా నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ...

మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో వైసిపి దక్షిణ ఇన్‌చార్జి కోలా గురువులు నాయకత్వంలో వందల సంఖ్యలో మత్స్యకారులు, మహిళలు ఫిషింగ్ హార్బర్ నుంచి జగదాంబ, కోర్టు వీధుల మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి డౌన్ డౌన్, మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఎన్నికల వ్యవస్థలపై అవగాహనకు పోటీలు

-డిఆర్ఒ చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకుని విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కలిగించేందుకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహణ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించాలన్నారు. నియోజకవర్గం స్థాయిలో జనవరి 18న, జిల్లా స్థాయిలో 21న పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జూనియర్స్‌కు బాధ్యత గల ఓటరుగా ఎలా ఉండాలి అనే అంశంపైనా, సీనియర్స్‌కు భారత రాజ్యాంగం – యువత పాత్ర అనే అంశంపై పోటీ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియ ప్రమాణాలు, ఎన్నికల్లో అసాంఘిక కార్యకలాపాలు అనే అంశంపై ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో వికలాంగులు ప్రత్యేక సమస్యలు ఉన్నవారికి ఎన్నికల్లో పాల్గొనేలా చేయడానికి ఏం చేయాలి. సామరస్యంగా ఎన్నికల నిర్వహణ, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై పోటీ ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా విద్యాసంస్థలు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మూర్తి, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ నగేష్, జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నిందితులకే బండారు అండ

బాధిత మహిళను పరామర్శించపోవడంపై దళిత సంఘాల నేతలు ఆగ్రహం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై జరిగిన దాడిలో తన వారి ప్రమేయం లేదంటూ పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు నిజం కాదని ఆయనే రుజువు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత మహిళ వివస్త్ర ఘటనపై టిడిపి, బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు బాధితురాలిని పరామర్శించారు. ఓదార్పునిస్తూ అండగా నిలబడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బండారు బాధిత మహిళను పరామర్శించలేదు. ఆయన వైఖరి బాధితులకు వ్యతిరేకమన్న అనుమానాలను కలిగించింది. పైగా ఈ నెల 3 వ తేదీన జిల్లా కోర్టుకు వెళ్లి గంటపాటు అక్కడ వేచి ఉండి ఈ ఘటనకు పాల్పడ్డ పెందుర్తి వైస్ ఎంపిపి తదితర నిందితులను పరామర్శించడంతో దాడి వెనుక ఆయన ప్రోద్బలం ఉందని జరుగుతున్న విమర్శలకు బలం చేకూర్చింది. ఎవరికి కష్టమొచ్చినా స్థానిక ఎమ్మెల్యేగా స్పందించాల్సిన ఆయన దళిత మహిళను వివస్త్రను చేసిన దుశ్శాసన పర్వాన్ని ఖండించకపోవడం, నిందితులకు అండగా నిలబడటం ఎవరికైనా ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. ఎమ్మెల్యే, ఆయన తనయుడు అప్పలనాయుడు తీరుపై నియోజకవర్గంలోని ప్రజలు ముఖ్యంగా దళితుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. ఎమ్మెల్యే వైఖరిపై టిడిపి అధిష్టానం కూడా స్పందించకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రతిపక్ష వైసిపి, సిపిఎం, సిపిఐ పార్టీలు జెర్రిపోతులపాలెంలో బాధిత మహిళను పరామర్శించాయి. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి గ్రామంలో ధర్నా నిర్వహించింది. ఇటీవల వైసిపి నేతలు గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదీప్‌రాజు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసి బాధిత మహిళకు న్యాయం చేయాలని, నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

నేడు కొయ్యూరులో 5కె రన్

కొయ్యూరు : మండలంలోని ఈ నెల 7వ తేదీ ఆదివారం 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ఇమ్మాన్యుయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రపాలెం మండల పరిషత్ కార్యాలయం నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుంటసీమ రహదారి మరమ్మతు చేపట్టరూ..!

ప్రజాశక్తి-దుంబ్రిగుడ

శిథిలావస్థకు చేరిన గుంటసీమ రహదారిని మరమ్మతు చేయాలని గిరిజన సంఘం మండల నాయకులు పి.డొంబు, రంగిలిసింగి సర్పంచ్ పి.అచ్చమ్మ డిమాండ్ చేశారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ రహదారి శిథిలావస్థలో ఉండడంతో రవాణాకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్లు కోతకు గురై ఉండడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బస్కీలో 'జన్మభూమి' బహిష్కరణ



మాజీ ఎమ్మెల్యే సోమను నిలదీస్తున్న గిరిజన మహిళ

ప్రజాశక్తి- అరకు రూరల్

సమస్యలు పరిష్కరించలేని జన్మభూమి మాకొద్దంటూ బస్కీ పంచాయతీ గిరిజనులు శనివారం జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ, ఎంపిడిఒ మల్లిఖార్జునరావు తన బృందంలో గ్రామానికి వెళ్తుండగా వారిని గ్రామం లోపలకు రానివ్వకుండా అడ్డుకున్నారు. టిడిపి, వైసిపి, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళన చేసి సాయంత్రం వరకు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ జన్మభూమి కార్యక్రమాన్ని జరగనివ్వలేదు. అధికారులు గో బ్యాక్, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ డౌన్ డౌన్ అంటూ పెద్దయెత్తున నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినా గిరిజనులు మాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో చేసేదేం లేక అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కామరాజు, ఎంపిటిసి మాణిక్యం జాడ మాత్రం ఎక్కడా కనిపించకపోవడం విశేషం. ఎంపిపి అరుణకుమారి, వైస్ ఎంపిపి అమ్మన్న, టిడిపి మండల అధ్యక్షులు బాబూరావు, ఎంపిడిఒ మల్లిఖార్జునరావు, సిడిపిఒ ఉమా, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ కృష్ణమూర్తి, పలు శాఖల అధికారులు పంచాయతీ జన్మభూమి కమిటీ సభ్యులు సమర్డి లైవోన్, బి.మొశ్య, టిడిపి మాజీ సర్పంచ్ బలరాం, వైసిపి నాయకులు సమర్డి బుజ్జిబాబు, సభాపతి, గోపాలరావు, బాబూరావు, ఆనంద్, సిపిఎం నాయకులు మధు, మల్లేశ్వరరావు, ధర్మ, టిడిపి నాయకులు నాగేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో బస్కీ గిరిజనులు నిరసన



క్యాలెండర్ ఆవిష్కరణలో నేతలు, అధికారులు

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెదబయలు/ పెదబయలు రూరల్

స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రజాశక్తి 2018 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. జెడ్‌పిటిసి గంగాభవాని చేతులమీదుగా క్యాలెండర్ ఆవిష్కరించి, అక్కడే ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులకు అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం కథనాలు ప్రచురించి, వాటి పరిష్కారానికి ప్రజాశక్తి చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.విజయ,మండల ప్రత్యేక అధికారి జె.త్రినాథ్, ఎంపిడిఒ వెంకన్నబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జె.సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సింహాచలం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.సూరయ్య, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ అలమండ ఉమామహేశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షులు బాబ్జి, డిటిఎఫ్ నాయకులకు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతగిరి

మండలంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం పంచాయతీరాజ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. టోకూరు పంచాయతీ బద్మరవలస హెలీప్యాడ్ మైదానంలో సభ జరగనుంది. దీంతో అక్కడ సభకు అవసరమైన ఏర్పాట్లు పాడేరు ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పట్టన్‌శెట్టి, సబ్ కలెక్టర్ డికె.బాలాజీ పర్యవేక్షణలో ఇప్పటికే పూర్తిచేశారు. జెసిబితో సభా ప్రాంగణాన్ని చదును చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మంత్రి ఘాట్ మార్గంలో అనంతగిరికి రానుండడంతో ఘాట్‌రోడ్డు పొడవునా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసి, తనిఖీలు ముమ్మరం చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు

అనంతగిరి : మండలంలోని టోకూరు పంచాయతీ బద్మరవలస గ్రామంలో ఆదివారం మంత్రి నారా లోకేష్ పర్యటన ఉండడంతో బొర్రాకు వెళ్లే వాహనాలను వేరే మార్గం గుండా మళ్లించేందుకు పోలీసులు ఏర్పాటుచేస్తున్నారు. బొర్రాకు వెళ్లే పర్యాటకులు అనంతగిరి మీదుగా అరకు చేరుకొని అక్కడి నుంచి లోతేరు, కోణాపురం మీదుగా అరకు చేరుకుంటారు. వచ్చేటప్పుడు కూడా అదేమార్గంలో రావాల్సి ఉంటుంది. అనంతగిరి, అరకు, లోతేరు, కోణాపురం మీదుగా బొర్రా చేరాలంటే చాలా కాలవ్యవధి, ఇంధన వ్యవధి అవుతుందని పలువురు పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు.

జన్మభూమి కార్యక్రమం వాయిదా

అనంతగిరి : మండలంలోని వాలాసీ, లుంగపర్తి, పినకోట, కివర్ల పంచాయతీ కేంద్రాల్లో శనివారం జరగాల్సిన జన్మభూమి కార్యక్రమం రద్దయ్యింది. ఆదివారం మంత్రి లోకేష్ పర్యటన కారణంగా అధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ఆయా పంచాయతీల్లో ఈ నెల 11వ తేదీన జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ రమేష్‌రమాన్ తెలిపారు.

సిపిఎం మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- కొయ్యూరు

ఈ నెల 7,8 తేదీల్లో అచ్యుతాపురంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు కోరారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సిపిఐ జిల్లా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెదబయలు రూరల్

వచ్చేనెల 9,10,11వ తేదీల్లో పాడేరు మండల కేంద్రంలో నిర్వహించు సిపిఐ 23వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జె.దేవరాజు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నామని,పార్టీ నాయకులు, గిరిజనులు సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.సోమేష్, అప్పన్న, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌టిఒ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎపిఎం చిన్నారావు

రైతు ఉత్పత్తిదారుల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ

మండల కేంద్రంలోఐకెపి ఆధ్వర్యాన రైతు ఉత్పత్తిదారుల ఆర్గనైజేషన్ భవనాన్ని శనివారం ఎపిఎం జె.చిన్నారావు ప్రారంభించారు. గిరిజన రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వారు పండించిన కూరగాయ పంటలను కొనుగోలుచేసి నిల్వ ఉంచేందుకు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎం చిన్నారావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 80 రైతు సంఘాలకు వ్యవసాయంపై ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ గురు, విఆర్ఎస్‌లు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లు, పాలకవర్గ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఆనంద్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి కమలాకర్, ఐకెపి సిసిలు ఆనంద్, కామరాజు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అందేలా కృషి చేయండి

పాడేరు రూరల్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి అరకు పార్లమెంట్ కన్వీనర్ కురుసా ఉమామహేశ్వరరావు, బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి లోకులగాంధీ కోరారు. మండలంలోని గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామంలో శనివారం బిజెపి కార్యకర్తల సమావేశం జరిగింది. గొండెలి పంచాయతీ బిజెపి అధ్యక్షులు పలాసి సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చ కార్యదర్శి కురుసా రాజారావు, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షులు సల్లా రామకృష్ణ, పాడేరు అసెంబ్లీ విస్తారక్ అనిల్‌కుమార్, నాయకులు పాంగి భాస్కర్, జ్ఞాన ప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మర్రిగుడలో కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న జిసిసి డిఎం

కాఫీ గింజలను జిసిసికి విక్రయించాలి : డిఎం

ప్రజాశక్తి-అనంతగిరి

గిరిజనులు తాము పండిస్తున్న కాఫీని జిసిసికే విక్రయించాలని పాడేరు జిసిసి డిఎం మోహనరావు కోరారు. శనివారం మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రిగుడ గ్రామాన్ని సందర్శించి రైతుల నుంచి స్వయంగా కాఫీని కొనుగోలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారుల బెడద లేకుండా జిసిసి గిరిజనుల నుంచి కాఫీని కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల వ్యక్తిగత ఖాతాల్లో కాఫీ సొమ్ములను . జిసిసి జమ చేస్తుందన్నారు. అనంతగిరి మండలంలో ఇప్పటి వరకు 90 క్వింటాల కాఫీని కొనుగోలు చేశామన్నారు. అరకు, పాడేరు, చింతపల్లి జిసిసి డిపోల పరిధిలో కాఫీ కొనుగోలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాశీపట్నం జిసిసి మేనేజరు రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన్యం మంచుమయం

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు ... గజగజలాడుతున్న 'గిరి'జనం

ప్రజాశక్తి-పాడేరు రూరల్

విశాఖ మన్యం మంచుమయంగా మారింది. రోజురోజుకూ తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో అక్కడి గిరిజనులు గజగజలాడుతున్నారు. శనివారం నాటికి పాడేరులో 7, మినుములూరులో 3, లంబసింగిలో 2, చింతపల్లిలో 4 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో మన్యం వాసులు అల్లాడిపోతున్నారు. ఉదయం 10.30 గంటల వరకు సూర్యుడు దర్శనమివ్వడం లేదు. దీంతో ఏ పనీ చేసుకోలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు, రైతులు రోజువారీ కార్యకలాపాలకు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కాదు. చిన్నారులు, వృద్ధులు చలికి తట్టుకోలేకపోతున్నారు. చలి మంటలను ఆశ్రయించినా చలి బారి నుంచి రక్షణ పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలంతా ఇళ్లల్లో కుంపటి పెట్టుకొని ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 10 వరకు, సాయంత్రం 7 గంగల నుంచి మండల కేంద్రాలన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతాయని మన్యం వాసులు భయాందోళన చెందుతున్నారు.



చలి మంట కాగుతున్న గిరిజనులు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం
ఆదివారం 07
జనవరి 2018

పేదల పక్షాన నిరంతర పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు





మాట్లాడుతున్న నర్సింగరావు, బాబూరావు, లోకనాథం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

పేదన పక్షాన నిరంతర పోరాటమే సిపిఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. అచ్యుతాపురంలో సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి మూడున్నరేళ్లు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రమాణ స్వీకారం రోజున పిఎం, సిఎం చేసిన హామీలు నేటికి నెర వేర్చ లేదన్నారు. అరచేతిలో స్వర్గం చూపించి అధికారం చేపట్టి ప్రజలను వంచించారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి తుంగలో తొక్కిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయడానికి స్పష్టమైన వైఖరి కరువైందని పేర్కొన్నారు. ప్రత్యేక ఆర్థిక మండలికి అచ్యుతాపురం, రాష్ట్రంలో 33 సెజ్‌లకు 33వేల 770 ఎకరాలు భూములను సేకరించారన్నారు. ఇందులో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 9వేల200 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతంగా సేకరించారని తెలిపారు. ఎకరానికి 50వేల రూపాయల పరిహారం ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించడంపై నిర్వాసితులకు సిపిఎం బాసటగా నిలచి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలు పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఎకరాకు 2లక్షల75వేల ధర వచ్చేంత వరకు పోరాటం చేశామన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామన్న వైఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. తీరం వెంబడి రసాయనిక పరిశ్రమలు నెలకొల్పడంతో వాటి వ్యర్థాలతో మత్స్యకారులు జీవనోపాధి తీవ్రంగా దెబ్బ తిందని చెప్పారు. బ్రాండిక్స్‌లో అతి తక్కువ జీతాలు ఇచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. 8వేల రూపాయలు జీతాలు ఇవ్వడానికి పరిశ్రమ వర్గాలు ముందుకు రాగా వాటిని అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెజ్‌లో పర్యటించి కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి మహిళా కార్మికులకు తీరని అన్యాయం చేశారని చెప్పారు. సెజ్‌లో స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ పరిశ్రమలు నెలకొల్పినట్లయితే ఈ ప్రాంతం ఊహించని విధంగా శరవేగంగా అభివృద్ధి చెంది ఉండేదని పేర్కొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ పాలనలో ఉన్న చైనాలో 135 కోట్ల జనాభా ఉన్నా వారందరికి విద్య, ఉపాధి, వైద్యం అందుతుందన్నారు.

రైతాంగం బతికేది ఎలా? : బాబూరావు

మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 15లక్షల ఎకరాల భూములు సేకరించ తలపెట్టారని, ఇందులో ఇప్పటికే 8లక్షల ఎకరాలు సేకరించారని తెలిపారు. భూములపై ఆధారపడి జీవించే రైతాంగం బతికే పరిస్థితి రాష్ట్రంలో లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సేకరించిన భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వ లేదన్నారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రాను రియల్ ఎస్టేట్‌గా మారుస్తున్నారని విమర్శించారు. రైతులను ఆదుకుంటానని చెప్పిన ముఖ్యమంత్రి వారిని నిరాశ్రాయులుగా చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం ను జాతీయ ప్రాజెక్ట్‌గా చేస్తానని చెప్పిన ప్రధాని, ఇందుకు సబంధించి సిఎం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ఫాసిస్ట్ పార్టీ విధానాలను అవలంభిస్తుందన్నారు. చివరకి ప్రణాళిక సంఘాన్ని లేకండా చేసిందన్నారు. నోట్ల రద్దుతో ఆర్థిక రంగం దేశవ్యాప్తంగా అతలాకుతలం అయిందని, చిన్న తరహా పరిశ్రమల మూతతో కార్మికులు రోడ్డు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టితో పెట్టుబడిదారులు లబ్ధిపొందారని, పేదలపై ఆ భారం తడిసి మోపుడు అవుతుందని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించాల్సి ఉందన్నారు.

నిర్వాసితుల సమస్యలపై పోరాటం : లోకనాథం

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. ఎంపిటిసికి 1200 ఎకరాల భూములు కేటాయించారని, పరిశ్రమల పనుల చేపట్టక పోగా రైతుల వద్ద సేకరించిన భూముల్లో టిడిపి బ్రోకర్లు వాటిని అనుభవిస్తురన్నారు. బిటెక్‌లు చదివిన నిర్వాసిత నిరుద్యోగులు ఉపాధి సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. భూములు కోల్పోయిన వారికే ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జన్మభూమి సభలు టిడిపి పార్టీ సభలుగా మారాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కోటేశ్వరరావు, రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, కొవిరి అప్పలరాజు, ఎ.బాలకృష్ణ, గనిశెట్టి సత్యనారాయణ, చోడపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మహాప్రదర్శన

అచ్యుతాపురంలో సిపిఎం కార్యకర్తలు శనివారం సాయంత్రం మహా ప్రదర్శన చేశారు. అచ్యుతాపురం హైస్కూల్ నుండి కైట్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. అక్కడ నుండి జంక్షన్ మీదుగా వేదిక వద్దకు ర్యాలీ చేరుకుంది. ర్యాలీలో సిపిఎం కేంద్ర కమిటి సభ్యురాలు హేమలత, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, జిల్లా కార్యదర్శి లోకనాదం తదితరులు పాల్గొన్నారు. థింసా నృత్యాలు, కోలాటాలు, వాయిధ్యాలతో ర్యాలీ అట్టహసంగా సాగింది. నృత్యాలు కనువిందు చేశాయి. ఈ ర్యాలీలో సిపిఎం నాయకులు రొంగలి రాము, కూండ్రుపు సోమునాయుడు, వివి శ్రీనివాసరావు, ఎస్.రామునాయుడు, చేపల తాత, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, కార్మికులు, కర్షకుకలు, రైతులు, రైతు కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులు, గిరిజనులు, వృత్తిపనివార్లు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి బస్సులు, ద్విచక్రవాహనాలపైన తరలి వచ్చారు. అచ్యుతాపురం కూడలి ఎరువు మయంగా మారింది.

వైద్యుడు లేని వైద్యాలయం

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట

బుచ్చెయ్యపేట పిహెచ్‌సిలో వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండేళ్లుగా నలుగురు వైద్యులు మారి ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ పాలనలో ఉంది. గత రెండేళ్ల క్రితం డాక్టర్ లత నియామకమం కాగా, ఈ ఏడాది మొదట్లో బదిలీపై పాకలపాడు వెళ్లారు. అనంతరం ధారకొండ పిహెచ్‌సి నుంచి డాక్టర్ సౌజన్య డిప్యుటేషన్‌పై వచ్చి విధుల్లో చేరారు. గత రెండు నెలల క్రితం ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం ఆమె రిలీవ్ అయ్యారు. అనంతరం రోలుగుంట పిహెచ్‌సి వైద్యాధికారి పి.బాపిరాజు ఇన్‌ఛార్జ్‌గా విధుల్లోకి చేరారు. నెల రోజుల పాటు విధులు నిర్వహించిన అనంతరం అతను రోలుగుంటకు వెళ్లారు. కెజిహెచ్ వైద్యులు రజనీకాంత్ నెల రోజుల క్రితం విధుల్లోకి చేరారు. అతను సైతం విశాఖలో శ్వాసకోస ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం వడ్డాది పిహెచ్‌సి డాక్టర్ కెఎం నాయుడు ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తున్నారు.


పిహెచ్‌సి పరిధిలో సుమారు 28 గ్రామాలు ఉన్నాయి. చిన్న చిన్న రోగాల నుంచి గాయాలు తదితర ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఈ పిహెచ్‌సికి రోగులు వస్తారు. అసలే మండలకేంద్రం కావడంతో నిత్యం వందలాది మంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. గత కొద్ది కాలంగా వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బుచ్చెయ్యపేట పిహెచ్‌సి



ఖాళీగా ఉన్న వైద్యుడి సీటు



రోగులు లేక వెలవెలబోతున్న పిహెచ్‌సి


- బుచ్చెయ్యపేట పిహెచ్‌సికి డెప్యుటేషన్ జబ్బు
- సబ్‌సెంటర్ల పరిస్థితీ ఇంతే

భర్తీకాని పోస్టులు

ఈ ఆసుపత్రి డిప్యుటేషన్ బారిన నడుస్తుంది. వైద్యులు ఎల్‌టి, స్టాఫ్‌నర్స్‌లు సైతం డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో రోగుల అవస్థలు వర్ణనాతీతం. ఎఎన్ఎం పోస్టులు సైతం పూర్తిస్థాయిలో భర్తీ కాలేదు. దిబ్బిడి, బుచ్చెయ్యపేట, గున్నెంపూడి, పొట్టిదొరపాలెం సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఒక్కొక్క సబ్‌సెంటర్‌లో మొదటి, రెండవ ఎఎన్ఎంలు ఉండాల్సి ఉండగా దిబ్బిడి, బుచ్చెయ్యపేట, పొట్టిదొరపాలెం సబ్ సెంటర్లలో ఒక్కొక్క ఎఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేక పోవడంతో ఒక్కొక్క ఎఎన్ఎం 7, 8 గ్రామాలకు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిబ్బంది ని నియమించాలని పలువురు కోరుతున్నారు.

ఆయుర్వేద ఆసుపత్రిలో అటెండరే డాక్టర్

గత ఐదేళ్ల నుంచి ఆయుర్వేద వైద్యాధికారి పోస్టు సైతం ఖాళీగా ఉంది. గత ఐదేళ్ల క్రితం ఇక్కడ పని చేస్తున్న ఆయుర్వేద డాక్టర్ నర్సీపట్నం దరి పాకలపాడుకు బదిలీ కావడంతో నాటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం అటెండర్‌తో ఆయుర్వేద వైద్యాలయం నిర్వహణ సాగుతుంది.



సిపిఎం జిల్లా మహా సభ దృశ్యాలు



బైక్ ర్యాలీ చేస్తున్న కార్యకర్తలు




సాంప్రదాయ వస్తువులతో వస్తున్న మహిళలు



ప్రదర్శన చేస్తున్న నాయకులు, కార్మికులు



చేపను చూపుతున్న నర్సింగరావు



వృద్ధులతో మాట్లాడుతున్న నర్సింగరావు



మహిళల సందడి



కార్యకర్తల సందడి



కోలాటం ఆడుతున్న మహిళలు



చెక్క భజన ఆడుతున్న మహిళలు



గీతాలను ఆలపిస్తున్న కళాకారులు, కార్మికులు



సభకు హాజరైన నాయకులు, కార్మికులు, మహిళలు

రేషన్ బియ్యం విక్రయిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి- మాడుగుల

తెలుపు రేషన్‌కార్డులు దారులు కోటా ద్వారా తీసుకుంటున్న బియ్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని ఏపి ఆహార సంఘం సభ్యులు ఎల్‌బి.వెంకటరావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రేషన్‌డిపోలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోల ద్వారా గతంలో కంటే నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, అయితే ఈ బియ్యాన్ని కార్డుదారులు ఎవరికైనా విక్రయించినట్టయితే వారి రేషన్‌కార్డులను రద్దుచేస్తామన్నారు. కొన్న వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం బియ్యంతోపాటు, పంచదార సరఫరా ప్రారంభించామని, మార్చినెల నుండి కిరోసిన్ కూడా పునరుద్ధరిస్తామన్నారు. గోధుమలు, గోధుమపిండి, కందిపప్పు సైతం పంపిణీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. మండల కేంద్రాలలో విలేజ్‌మాల్స్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న ఆహారసంఘం సభ్యుడు వెంకటరావు

సివిల్‌సప్లయి డిటి లారెన్స్, సర్పంచ్ వెంకటలక్ష్మిసూర్యారావు, వైస్ ఎంపిపి పెరుమాళ్ల వెంకటరావు, డీలర్ల సంఘం ప్రతినిధి చింతలమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు చోడవరంలో 5కె రన్

ప్రజాశక్తి - చోడవరం

జన్మభూమి సందర్భంగా ఆదివారం 5కె రన్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ జివి చిట్టిరాజు శనివారం తెలిపారు. స్థానిక కొత్తూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్య, వైద్య, ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ తదితర శాఖలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 6.30 గంటలకు కొత్తూరు జంక్షన్‌కు రావాలని కోరారు. దీనికి సంబంధించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

నేడు మాడుగులలో జన్మభూమి 5కె రన్

మాడుగుల : జన్మభూమి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ డేవిడ్‌రాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు మాడుగుల బస్‌స్టాండు నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలోపాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రభాకరరావు

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల

జాతీయసేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, వివిధ అంశాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మాడుగుల కళాశాల ప్రిన్సిపల్ కె.ప్రభాకరరావు అన్నారు. శనివారం వీరవల్లి అగ్రహారంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించి, వివిధ అంశాలలో ప్రజలకు చైతన్యం కలిగిస్తారన్నారు. చోడవరం కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థి దశనుండే సేవా కార్యక్రమాలు అలవాటు చేసుకోవాన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్‌బీబీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు నర్సింహమూర్తి, అధ్యాపకులు మహేష్,జగదీష్, వీరవల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

విద్యార్థులకు అవగాహన సదస్సు

వడ్డాది : ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపి మహిళా సమత సొసైటీ మండల రిసోర్స్‌పర్సన్ పి.రమణమ్మ కోరారు.ఆధ్వర్యంలో శనివారం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కొత్తూరు పాఠశాలలో హెచ్ఎం ఎ.సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్కూల్ పర్యవేక్షణ కమిటీ సభ్యుల పాత్ర, వారి బాధ్యతలు, ఆర్‌టిఇ చట్టంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు టి.ఉషారాణి, వి.ఫణికుమార్, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగమణి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి - కె.కోటపాడు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్ సంచార వైద్యశిబిరం డాక్టర్ బి.నాగమణి కోరారు. శనివారం మండలంలోని వారాడసంతపాలెం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. బిపి, ఆస్తమా, షుగర్, స్త్రీల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టివి నాయుడు, ఫార్మసిస్ట్ బి.సత్యనారాయణ, ఎఎన్ఎం జ్యోతి, డ్రైవర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

మౌలిక వసతులపై విద్యార్థుల సర్వే

ప్రజాశక్తి-కొత్తకోట

జన్మభూమి,మాఊరు కార్యక్రమంలో భాగంగా కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం గ్రామంలో మౌలిక వసతులు, సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మేజర్ పంచాయతీలో ఇంటింటా పర్యటించి సమస్యలపై సర్వే చేసి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు తమ సర్వే దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పెంటయ్యపాలెంలో 2017 రౌండప్ క్విజ్

ప్రజాశక్తి-మాడుగుల

జన్మభూమి సందర్భంగా మండలంలోని పెంటయ్యపాలెం పాఠశాలలో శనివారం 2017 రౌండప్ క్విజ్ పోటీలను పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి ఆధ్వర్యంలో నిర్వహిచారు. ఐదు బృందాలుగా క్విజ్ నిర్వహించగా, ఎస్.కుసుమ బృందం ప్రథమ బహుమతి పొందింది.కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కెనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పార్వతి, మూర్తి, అబ్బులరాజు, పార్వతి, రేవతి, చైతన్య, శ్రీను, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో 'అయ్యన్న' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కె.కోటపాడు

స్థానిక అయ్యన్న విద్యాసంస్థలోని ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు సైబర్ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్‌కె ఖాసీం తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నవంబరు నెలలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో ఆరుగురు విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారన్నారు. వీరిలో 3వ తరగతికి చెందిన చింటు ప్రేమ ప్రశాంత్ రాష్ట్రస్థాయిలో 40వ ర్యాంక్, 4వ తరగతికి చెందిన బండారు నరేంద్ర 53వ ర్యాంక్, వంకదార బాలాజీ 61వ ర్యాంక్, బండారు గంగా ప్రతిభ 78వ ర్యాంక్, బండారు భాగ్యశ్రీ 84వ ర్యాంక్, పిఎస్‌పివి హర్షవర్ధన్ 92వ ర్యాంక్ సాధించి రాష్ట్రస్థాయిలో టాపర్స్‌గా నిలిచి, వచ్చేనెల 4న నిర్వహించనున్న తొలిదశ పోటీలకు అర్హత సాధించారన్నారు. విజేతలకు బంగారు



ప్రశంసాపత్రాలను అందిస్తున్న నన్నయ యూనివర్సిటీ

పతకంతో పాటు ప్రశంసాపత్రాలను అందించగా, వీటిని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు శనివారం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ పూడి సత్యనారాయణ, అయ్యన్న ప్రిన్సిపల్ శ్రావణి, బి.సుమతి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో దేవాలయ వంటగది నిర్మాణం



శ్లాబు నిర్మాణ పనుల్లో కూలీలు

ప్రజాశక్తి- మాడుగుల

మాడుగుల మోదమాంబ ఆలయానికి అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేటాయించిన రూ.5లక్షల నిధులతో వంటషెడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.. శనివారం ఈ నిర్మాణానికి శ్లాబు వేశారు. ప్రస్తుతం ఉన్న రెండు షెడ్ల మధ్యలో ఈ నిర్మాణం జరుగుతుండడంతో, మేడ మీద విశాలమైన కల్యాణమండపంతోపాటు, దిగువున విశాలమైన భోజన హాలు ఏర్పాటు కానుంది.

ప్రస్తుతం ఈకల్యాణమండపంలో అనేక వివాహాలు జరుగుతుండడంతో, ప్రస్తుతం నిర్మిస్తున్న ఈకట్టడానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదేవిధంగా మాడుగుల గ్రామానికి చెందిన సత్యవతి అనే మహిళ రూ.లక్ష విరాళంగా ప్రకటించడంతో మేడమీద అతిథిగృహం నిర్మాణం జరుగుతోంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతాడ శివ, పుట్టా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.15కోట్లతో ఖండివరం గ్రామాభివృద్ధి

- జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవాని

ప్రజాశక్తి - చీడికాడ, దేవరాపల్లి

మండలంలోని ఖండివరం గ్రామ అభివృద్ధికి కోటి 15 లక్షలు నిధులు అందిస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. శనివారం మండలంలోని ఖండివరం, అర్జునగిరి జన్మభూమి గ్రామసభల్లో జెడ్‌పి చైర్‌పర్సన్‌తో పాటు ఎంఎల్‌సిలు పప్పల చలపతిరావు, అనగ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాలం భవాని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, సమస్యలు పరిష్కరించడమే జన్మభూమి ముఖ్యోద్దేశన్నారు. చలపతిరావు మాట్లాడుతూ అధికారులు సక్రమంగా పనిచేయకపోతే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత జన్మభూమిలో ఇచ్చిన దరఖాస్తుల వివరాలను డిటి రామాచార్యులను అడుగగా, సరైన సమాధానం రాకపోవడంతో వివరాలు లేకుండా ఈ సభకు ఎందుకు వచ్చారని ఎమ్మెల్సీ చలపతిరావు మండిపడ్డారు. ఎగువస్థాయి అధికారులు రావాల్సి ఉండగా, దిగువస్థాయి అధికారులు సభలకు రావడమేమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సి రామ్మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు పింఛన్లు, హౌసింగ్ వంటివి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పాఠశాలల్లో బెంచీల ఏర్పాటుకు తన సొంత నిధులు రూ.30 వేలును మాజీ ఎంఎల్ఏ గవిరెడ్డి రామానాయుడు ఆర్థిక సాయం అందించారు. సభలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ధింసా నృత్యకారులతో కలిసి గవిరెడ్డి డ్యాన్స్ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టివి కామేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపిపి కుచ్చు కళావతి, ఎంపిడిఓ గ్లాడ్స్, తహశీల్దార్ పి.భాగ్యవతి, టిడిపి నాయకులు పోతల రమణమ్మ, గండి ముసిలినాయుడు, సింగంపల్లి ముత్యాలనాయుడు, రెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, పేదలకు అవసరమయ్యే సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలు చేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ లాలం భవానిభాస్కర్



చీడికాడలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ భవాని

అన్నారు. పెదనందిపల్లి జన్మభూమి గ్రామసభలో మాట్లాడారు. జన్మభూమి రాష్ట్ర పరిశీలకులు అంగన రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే బాధ్యత వహిస్తాననిహామీ ఇచ్చారు. గ్రామంలో జెడ్‌పి పాఠశాలకు బెంచీలు లేవని విద్యాకమిటీ చైర్మన్ కొరుప్రోలు రామలింగస్వామి సభ దృష్టికి తీసుకురాగా, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గవిరెడ్డి రామానాయుడు స్పందించి, తనవంతు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. సమావేశంలో ఎంఎల్‌సి పప్పల చలపతిరావు, సర్పంచ్ కొరుప్రోలు దేముల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి- సబ్బవరం

అక్రమంగా నిర్మాణాలు చేస్తే సహించని తహశీల్దార్ పైలా రామారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సర్వేనెంబరు 271లో అక్రమంగా నిర్మించిన 12 షెడ్లులు, 5 పునాదులను ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పదేళ్లుగా ఆక్రమణలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టి భూకబ్జా బ్రోకర్లు, కోట్లు వసూలు చేసినప్పటికీ రెవెన్యూ యంత్రాంగం కబ్జాదారులకు ప్రోత్సహించింది. దీంతో సర్వేనెంబరు 271లో సుమారు 50 ఎకరాలు వేల కోట్ల విలువైన



అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూమి కబ్జాకు గురైంది. ఇటీవల కొత్తగా వచ్చిన తహశీల్దార్ పైలా రామారావు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తహశీల్దార్‌కు సమాచారం వచ్చిన వెంటనే వాటిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తమ సిబ్బంది సహాయంతో ఆక్రమణలను వెంట వెంటనే తొలగిస్తున్నారు. ఆర్ఐ వేణుగోపాలరాజు, విఆర్ఒలు రుక్మిణి, సురేష్, విఆర్ఎ అప్పారావు ఆక్రమణలు జెసిబి సహాయంతో తొలగించారు. ఇలా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

జన్మభూమిలో పార్టీల జోక్యం తగదు

అనకాపల్లిటౌన్ : జన్మభూమి, మాఊరి కార్యక్రమంలో పార్టీ జోక్యం తగదని సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, ఎం మాధవరావు అన్నారు. శనివారం స్థానిక కోడగంటి గోవందరావు భవనంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాలకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శ్రద్ధ చూపడం లేదని వారి ప్రసంగాలతోటే కార్యక్రమాలు ముగిస్తున్నారని విమర్శించారు. ప్రజారాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు మాట్లాడుతూ నియమనిబంధనలకు లోబడి కార్యక్రమాలు జరగడం లేదని పార్టీలకు సంబంధించిన వ్యక్తులు జోక్యం అధికంగా ఉంటుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు కల్పించుకొని జన్మభూమి సభల్లో పార్టీ సంబంధించిన వ్యక్తులను నిలువరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా 'ఇంటింటికి గోవిందుడు'

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తూరు నర్సింగరావుపేట గ్రామంలో శనివారం 1008 ఇంటింట గోవిందుడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అరిగా అర్జున్ మంగ దంపతుల ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ భక్త బృందం సభ్యులు కరణం సావిత్రమ్మ, భీశెట్టి లక్ష్మి, గొల్లవిల్లి లీలావతి, జి నూకరత్నం, అరిగా లక్ష్మి, అన్నపూర్ణ, పాల్గొన్నారు.

పండగ పూట పస్తులు తప్పవా : సిపిఐ

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

రేషన్ షాపుల్లో వేలిముద్రలు పడక కార్డు దారులు రేషన్ అందక నానా పాట్లు పడుతున్నారని పండగ పూట వీళ్లంతా పస్తులు ఉండాలా సిపిఐ నాయకులు వైఎన్ భద్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రేషన్ కార్డు లబ్దిదారులకు సాఫ్ట్‌వేర్ పని చేయక వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ షాపులు చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేలిముద్రలు పడకపోయినా ఐరీష్ ద్వారా రేషన్ అందించేవారని ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ వెర్షన్‌ను 4.9కు మార్చడం వలన ఐరీష్ సపోర్టు చేయడం లేదని రేషన్ డీలర్లు చెబుతున్నారన్నారు. దీనికి తక్షణమే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోన లక్ష్మణ్, కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

'ఆమ్ ఆద్మీ' కార్యకర్తల శ్రమదానం

అనకాపల్లి : పట్టణంలోని ఆమ్ఆద్మీ పార్టీ కార్యకర్తలు శ్రమదానం చేశారు.శనివారం ఆ పార్టీ నాయకులు కొణతాల హరినాథబాబు ఆధ్వర్యంలో పూడిమడక రోడ్డులో గోతులను పూడ్చారు. పెద్దపెద్ద గోతులతో ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాఊరి రవికుమార్, ఎం శ్రీనివాసరావు, అట్లబోయిన నారాయణరావు, కాండ్రేగుల రామకృష్ణ, బొడ్డేడ దేవయ్య, ఎస్ గణేష్‌కుమార్, కాసు బ్రహ్మానందం, ఈ లక్ష్మణరావు, ఎన్.జితేంద్ర, ఎన్.జ్ఞానేంద్ర, ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

8న శిస్తుకు భూముల వేలం

మునగపాక : మునగపాక మండలంలోని నాగులాపల్లి గ్రామం వద్ద వేదులవారి సతర్వ భూములు అనకాపల్లి హక్కు గల భూములు 8 ఎకరాలను మూడేళ్ల కాల పరిమితి వరకు శిస్తుకు బహిరంగ వేలం వేస్తున్నట్లు తహశీల్దార్ రాంబాబు తెలిపారు. ఈ వేలం పాటను దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని చెప్పారు

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సబ్బవరం

అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, ఎన్‌టిఆర్ ఇళ్లు, పింఛను కార్డులు మంజూరు చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని అసకపల్లి, పైడివాడ అగ్రహారం, అంతకాపల్లి, అయ్యన్నపాలెం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి అందిస్తున్నామని చెప్పారు. రావలమ్మపాలెంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొక్కాలు గోవింద, ఎంపిటిసి సబ్బవరపు ముత్యాలనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు, ఆర్ఇసిఎస్ చైర్మన్ కొటాన అప్పారావు, టిడిపి నేతలు బుచ్చిరాజు, దొడ్డి సూర్యప్రకాశ్, కోరాడ శ్రీనివాసరావు, కె.రామకృష్ణరాజు, బంగారునాయుడు, అసకపల్లి సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, ఎంపిటిసి కరణం రామునాయుడు, తహసీల్దార్ పైలా రామారావు, ఎంపిడిఒ షేక్‌బాబూరావు, ఇఒఆర్‌డి కె సూర్యనారాయణ, పైడివాడ అగ్రహారం సర్పంచ్ దాసరి వెంకటరమణ, ఎంపిటిసి అక్కిరెడ్డి రామలక్ష్మి, అక్కిరెడ్డి దుర్గినాయుడు, బొబ్బరి కన్నారావు, అయ్యన్నపాలెం సర్పంచ్ వంకర పెంటయ్య,.ఎంపిటిసి తుమ్మపాల అప్పారావు, తుమ్మపాల నానాజీ, గవర అప్పారావు, పెద్దాడ రమణమ్మ, గవర సత్యనారాయణ పాల్గొన్నారు.

కశింకోట : ప్రభుత్వ పథకాలు అర్హులకు అందిస్తామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శనివారం



రైతులకు దాణా ప్యాకెట్లు అందిస్తున్న వైద్యులు

కశింకోటలో జన్మభూమి -మాఊరి గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశింకోటలో శారదానది ఫుట్‌పాత్ వంతెనకు రూ.2కోట్ల 80లక్షలు నిధులు మంజూరు అయాయ్యని చెప్పారు. వై.తునిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పశువైద్యాధికారులు పశువులను తనిఖీ చేసి దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ జ్ఞానవేణి, ఎంపిడిఒ బివి సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు మలసాల రమణారావు, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, వేగి గోపీకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ తిరుచోళ్ల నాగేశ్వరీ, పెంటకోట రోము, పంచదార్ల సూరిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడడమే జన్మభూమి - మాఊరు లక్ష్యమని జెసి 2 డాక్టర్ సిరి అన్నారు. శనివారం మండలంలోని కుంచంగి గ్రామంలో జన్మభూమి- మాఊరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం విదేశీ విద్య ఆదరణ పథకంలో భాగంగా రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అనంతరం ఇటీవల మరణించిన ముమ్మిన నూకరత్నం కుటుంబానికి రూ.5వేలు చంద్రన్న బీమా చెక్కును అందించారు. బాలలకు ఆమె చేతుల మీదుగా బాలామృతాన్ని అందించారు. అంతకు ముందు గ్రామంలో ప్రధాన రహదారి పరిశీలించిన ఆమె రోడ్డు అద్వాన్నంగా ఉండడంతో రోడ్డు పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పల్లెల గంగాభవాని, గ్రామ సర్పంచ్ పల్లెల బాబ్జి, మండల ప్రత్యేక అధికారి సూర్యచంద్ర, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒఆర్‌డి అప్పలరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : రాష్ట్రానికి ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్ రెడ్డి ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టకరమని రాష్ట్ర మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం స్థానిక గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద నిర్వహించిన జన్మభూమి, మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 45ఏళ్లకే వృద్ధాప్య పించన్లు ఇస్తానని ప్రకటనలు చేస్తున్న జగన్‌కు 60ఏళ్లు వస్తే వృద్ధాప్యం అన్న సంగతి తెలియదా అని ఎద్దేవా చేశారు. అనంతరం మంత్రి అయ్యన్న లబ్దిదారులకు చంద్రన్నకానుకలు, బాలింతలకు బేబికిట్లు, ఉపాధి కూలీలకు గుణపాలు అందజేశారు. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి అయ్యన్నకు అందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, జోనల్ కమీషనర్ షేక్‌సుభాని, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీష్, టిడిపి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర, డాక్టర్ కె విష్ణుమూర్తి, కెవి సత్యవతి, కొణతాల వెంకటరావు, బిఎస్ఎంకె జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

ప్రజాశక్తి- మునగపాక

చేసింది గోరంత చెప్పుకునేది కొండంత ఇదేనా నాయకులు తీరు అని తిమ్మరాజుపేటలో ఓ మహిళ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును నాయకుల తీరును తప్పుపట్టింది. తిమ్మరాజుపేటలో శనివారం జన్మభూమి కార్యక్రమం ముగించుకొని తిరిగి వస్తుండగా ఒక మహిళ ఎమ్మెల్యేను రుణమాఫీ విషయమై ప్రశ్నించింది. గ్రామానికి ఒకరిద్దరికి రుణమాఫీ చేసి అందరికి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకోవడం తగదని శరగడం నూకరత్నం ఎమ్మెల్యేను తప్పుపట్టింది. దీంతో టిడిపి నాయకులు కల్పించుకొని నీకు రుణమాఫీ అయిందా లేదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై నూకరత్నం ఆగ్రహం వ్యక్తం చేస్తూ అందరికి రుణమాఫీ చేస్తామని చెప్పుకుంటున్నారు. కానీ ఇంతవరకూ రుణమాఫీ జరగని వారి పరిస్థితి ఏంటో మీకు తెలుసా అని వారిపై మండిపడ్డారు. ఇప్పటికీ 3వ విడత రుణమాఫీ పేరుతో బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారే గానీ, నిజానికి చేస్తారా అని ప్రశ్నించింది. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. రైతులను, రుణమాఫీ ఉన్న లబ్దిదారులకు బ్యాంకుల చుట్టూ తిప్పారా, రైతులతో రాజకీయ కుంతంత్రాలు తగదని హెచ్చరించారు. దీంతో సిఐ రామచంద్రరరావు వచ్చి ఎమ్మెల్యే కారులో పంపించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం, టెక్కలిపాలెం గ్రామాల్లో విశాఖడెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు చేతుల మీదుగా పాడి రైతులకు శనివారం సంక్రాంతి భోనస్‌లను పంపిణీ చేశారు. బాటజంగాలపాలెంలో 84 మంది రైతులకు రూ.2లక్షల31వేల685, టెక్కలిపాలెంలో 147 మందికి రూ.3లక్షల71వేల213 అందింజేశారు. అలాగే 69 మంది రైతులకు వడ్డీలేని రుణాల కింద ఒక్కొక్కరికి 30వేలు చొప్పున 20.70లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సంక్రాంతి పండుగను పాడి రైతులందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ జి భూలోకనాయుడు, సూపర్‌వైజర్ కె వాసుబాబు, పాలకవర్గ సభ్యులు కె నర్సింహులు, బి రామచంద్రరరావు, బి నూకరాజు పాల్గొన్నారు.

మునగపాకలో.. : మండలంలో ఉమ్మలాడ గ్రామంలో విశాఖ డెయిరీ పాడి రైతులకు శనివారం సంక్రాంతి బోనస్ పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ ఆసుపత్రి సిఇఒ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం పాడి రైతుల కొరకే శ్రమించే సంస్థ డెయిరీ అని తెలిపారు. 120 మందికి రూ.2లక్షల85వేల620 భోనస్ ఇచ్చినట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి ఇదే భోనస్ 5లక్షలు అందుకునే విధంగా సెంటర్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెఒ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఆది అప్పారావు, పిఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



బోనస్‌లు పంపిణీ చేస్తున్న విశాఖ డెయిరీ బృందం

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివేకానంద స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానశిక వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ స్వామి వివేకానంద వ్యక్తిత్వ వికాశంపై ఆధ్యాత్మికపై ప్రపంచ నలుమూలల ఆయన సూక్తులు ఎందరో యువకులు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ ఎస్ఐ డిశ్రీనివాసరాజు, వివేకానంద స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కె శ్రీనివాస వర్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డివైఎన్ వర్మ, ఎస్ఎన్ఎస్‌కోఆర్డినేటర్ ఎల్ సత్యప్రసాద్, వివేకానంద స్ఫూర్తి సభ్యులు కాశి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

నర్సీపట్నం ఎఎస్‌పి అరీఫ్‌హాఫీజ్

ప్రజాశక్తి- ఎస్.రాయవరం

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నర్సీపట్నం ఎఎస్‌పి కె అరీఫ్‌హాఫీజ్ సూచించారు. అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయానికి శనివారం వచ్చిన ఆయన హైవే పెట్రోలింగ్, యలమంచిలి, నక్కపల్లి, సర్కిళ్ల పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది, జాతీయ రహదారి అధికారులతో సమావేశమయ్యారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి నుండి పాయకరావుపేట మండలం తాండవ బ్రిడ్జి వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై 33 చోట్ల ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. అవకాశం ఉన్న చోట ఆయా పంచాయతీలను అనుసంధానించుకుని లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట యలమంచిలి రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాము, టౌన్ ఇన్‌స్పెక్టర్ జి నారాయణరావు, నక్కపల్లి ఎస్ఐ సింహాచలం నాయుడు, ఎఎస్ఐ రామ్‌మోహనరావు, జాతీయ రహదారుల నిర్వాహణ ఇంజినీరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎఎస్‌పి

పాలిటెక్నిక్ కోర్సుకు అవకాశం

ప్రజాశక్తి- పాయకరావుపేట

ఐటిఐ రెండేళ్ల కోర్సు (ఎన్‌సివిటి)లో ఉత్తీర్ణులై 60శాతం మార్కులు పొందిన అభ్యర్థులకు పాలిటెక్నిక్ కోర్సు చదివే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎం కనకారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఐటిఐ పాయకరావుపేటలో నిర్వహించే ఈ కోర్సులో నెల రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనపరచిన వారికి పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులో నేరుగా ద్వితీయ సంవత్సరం సీట్లను కేటాయిస్తారని ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి మార్కులిస్ట్, ఐటిఐ పాస్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ప్రభుత్వ ఐటిఐ, పాయకరావుపేటలో ఈనెల 8లోపు సంప్రదించాలన్నారు.


ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - నక్కపల్లి

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జన్మభూమిలో భాగంగా పల్లె సిరులుపై చర్చించారు. ప్రాచీన సంస్కృతిని ప్రతిభింభించే జానపద కళలు, సాహిత్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు, పిఇటి రాజు, పాల్గొన్నారు.

వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాసరరావు ఆధ్వర్యంలో జన్మభూమిలో భాగంగా శనివారం విద్యార్థులకు క్విజ్, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు.స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రత్యేకాధికారి విమలాదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

వెదురువాడలో ఇంటింటా సర్వే

ప్రజాశక్తి- అచ్యుతాపురం

వెదురువాడ గ్రామంలో ప్రశాంతి కాలేజి విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా పారిశుధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. అక్షరాస్యత, విద్యా, వైద్యంపై అవగాహన కల్పిస్తామని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి గోపాకృష్ణ తెలిపారు.


సర్వే చేస్తున్న విద్యార్థి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని అనకాపల్లి ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇరువాడ గ్రామంలో శనివారం జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళలకు రుణాలు, రైతులకు పవర్ టిల్లర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారుల పాత్ర కీలకమైందన్నారు. అర్హులకు పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, పించన్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుజన, మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజాన రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఇరువాడ గ్రామ సర్పంచ్ పిళ్లా సతీష్, మండల ప్రత్యేక అధికారి మిట్టల్, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ పి బలరాముడు, హౌసింగ్ ఎఇ ప్రసాద్, మండల ఇంజినీర్ సోమశేఖర్, వ్యవసాయాధికారి రంగాచారి పాల్గొన్నారు.

ఎస్‌రాయవరం :ఈ ప్రాంతంలో ఉన్న అటవీ, సార్ట్ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన భూములపై ఆయా శాఖలను సంప్రదించి మత్స్యకారుల ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పాయకరావవుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గుడివాడ, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్స్యకారుల జీవనం వైవిద్య భరితంగా ఉంటుందని తెలిపారు.తెల్లవారుజాము నుంచే చేపలవేట కోసం జీవనం ప్రారంభమవుతుందని చెప్పారు. మత్స్యశాఖ ద్వారా 50 నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారికి పెన్షన్ వచ్చేలా జిఒ జారీ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్‌కె పుష్పమణి, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక అధికారి రవికుమార్, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎంపిపి వినోద్‌రాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు నల్లపరాజు వెంకటరాజు, కార్యదర్శి గుర్రం రామకృష్ణ, సర్పంచ్ బంగారి, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌రాయవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నక్కపల్లి : మండలంలో చినతీనార్ల, ఎన్.నర్సాపురం, ఉద్దండపురం, సి.హెచ్ లక్ష్మీపురం, పెదతీనార్ల, నెల్లిపూడి గ్రామాల్లో అధికారులు శనివారం జన్మభూమి-మావూరు కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపిడిఒ పిడుగు ఉమామహేశ్వరరావు, ఇఒఆర్డీ పిఎస్ కుమార్ టీమ్‌లు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ పత్రాలు అందజేసారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌టి జాబితాలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మత్స్యకారులకు గత ఎన్నికల్లో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిప్యూటీ తహశీల్దార్ నర్సింగరావుకు వైసిపి నాయకులు సిహెచ్ అప్పారావు, మెరుగు అప్పలనాయుడు, మెరుగు అప్పలరాజు, సూరాడ రాజమౌళి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో హామీ మత్స్యకారులు ఓట్లు వేశారని తెలిపారు. ఆ హామీలను నేటి వరకు నెరవేర్చక ఎంతవరకు సబబని ప్రశ్నించారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా మహాసభలకు వెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - నక్కపల్లి

అచ్యుతాపురంలో జరుగుతున్న సిపిఎం విశాఖ జిల్లా మహాసభలకు నక్కపల్లి మండలం నుంచి నాయకులు శనివారం తరలి వెళ్లారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ పి.వెంకటస్వామి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలరాజు విలేకర్లతో మాట్లాడుతూ, వైజాగ్, చెన్నై కారిడార్ నిర్వాసితులు, పాయకరావుపేట నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, నక్కపల్లిలో 50 పడకల ఆసుపత్రి, కోటవురట్ల మండలంలో గిరిజన గ్రామాలకు రోడ్లు, పోడు భూములకు సాగు పట్టాలు, పాయకరావుపేటలో మెయిన్ రోడ్డు విస్తరణ, అడ్డురోడ్డు, రేవుపోలవరం రోడ్డు వెడల్పు, కంపెనీల్లో స్థానికులకు ఉపాధి తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి :

సిపిఎం మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలో సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేముడునాయుడు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై సిపిఎం నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఎన్‌ఎఒబి, ఎస్‌ఇజెడ్ నిర్వాసితులకు ప్యాకేజీ అమల్లో తీవ్రమైన అన్యాయం జరుగు తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాటం చేస్తున్న నాయకుల గొంతు నొక్కేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ గంగరాజు, జి సత్తిబాబు, కె.నూకరత్నం, ఎం.దేవి, సిహెచ్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లిలో సభకు వెళుతున్న నాయకులు

9న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- అచ్యుతాపురం

సిపిఎస్ రద్దుకు ఈ నెల 9న పాత తాలూకా కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పెన్షన్ సాధన సమితి భాగస్వామ్య పక్షం జిల్లా కో చైర్మన్ జి.మధు పిలుపునిచ్చారు. భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో కలిసి స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతో పాటు యూనిఫాం ఎంప్లాయిస్ (పోలీస్) కూడా సిపిఎస్ రద్దు ఉద్యమంలో చేరారన్నారు. ప్రభుత్వ విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. పెన్షన్ సాధన సమితి జిల్లా స్థాయి నాయకత్వాన్ని త్వరలో ఎన్నుకుంటామని తెలిపారు. రెండవ దశ ఉద్యమంలో భాగంగా జిల్లా కేంద్రాల్లో ఫిబ్రవరి 10న ర్యాలీ, ధర్నా నిర్వహిస్తామని, మూడవ దశలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.నూకరాజు, బి.శివానందం, కొల్లి రాజు, ఓం.సరళాదేవి, వి.మురళి, కె.చిరంజీవిరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నక్కపల్లి

మండలంలో దేవవరంలోని చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... చెరువులో మృతదేహం పైకి తేలడంతో శనివారం ఉదయం స్థానికులు గమనించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సింహాచలం మృతదేహాన్ని బయటకు తీయించారు. స్థానిక 30 పడకల ఆసుపత్రిలో మార్చురికి తరలించారు. మృతునికి 45 సంవత్సరాలు ఉండి, నలుపు ప్యాంట్, నల్లటి చారలు కలిగిన చొక్కా వేసుకుని ఉన్నాడని తెలిపారు.


గుర్తుతెలియని మృతదేహం

నీటి డ్రమ్ముల పరిశుభ్రత

ప్రజాశక్తి - నక్కపల్లి

స్థానిక జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నీటి డ్రమ్ములను పరిశుభ్రం చేశారు. 'మౌలిక సదుపాయాలు' అనే కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం అధికారి కె.కొండలరావు ఆధ్వర్యంలో శనివారం శుభ్రం చేసారు. మౌలిక వసతులను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపల్ రామచంద్రరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రోడ్లు నిర్మించారు.. మదుములు మరిచారు..

ప్రజాశక్తి - గొలుగొండ

గ్రామాల్లో సిమ్మెంటు రోడ్లు నిర్మించి, అవసరమైన వాటికి మదుములు, సైడుకాలువలు నిర్మించకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సైడుకాలువలు లేకపోవడంతో వర్షపునీరు నిల్వలు ఎక్కడకక్కడ పేరుకుపోయి దోమలుబెడద అధికమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎఎల్‌పురం, పాతకేడిపేట, కొంకశింగి, నాగాపురం లింగంపేట, చోద్యం, కొత్తమల్లంపేట, అమ్మపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, జోగుంపేట, సాలికమల్లవరం, చీడిగుమ్మల, కె.ఎల్లవరం, పాకలపాడు, యేటిగైరంపేట, పుత్తడిగైరంపేట, గుండుపాల, కశిమి, కొమిర పంచాయితీలలోను సిమ్మెంటు రోడ్లు నిర్మించారు. ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్ళలో సుమారు రూ.50 కోట్లతో గ్రామాల్లో చాలా వరకు సిమ్మెంటు రోడ్లు నిర్మించారు. రోడ్లు నిర్మాణాలు అయితే జరిగాయి కాని వాటికి ఇరువైపులా ఏర్పాటు చేయాల్సిన కాలువలు నిర్మించలేదు. దీనివల్ల వర్షపునీరు, ప్రజలు వినియోగించిన నీరు నివాస గృహాల మధ్య నిల్వ ఉండిపోయి దోమలుకు నిలయాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని గమనించి సిమ్మెంటు రోడ్లుకు ఇరువైపులా కాలువలు, అవసరమైనచోట్ల మదుములు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మదుములేని సిసి రోడ్డు

ఇక్కట్లు తప్పడం లేదు



1. సిమ్మెంటురోడ్లు నిర్మించారు. కాని రోడ్లకు మదాలు, మురుగునీటి కాలువలు నిర్మించలేదు. దీంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ నివాస గృహాల మధ్య మురుగునీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. మదుములు లేకపోవడం వల్ల రోడ్లపైకివెళ్ళడానికి, దిగడానికి, వాహనాలతో ఇబ్బందులు పడుతున్నాము.

-సందిపర్తి వెంకునాయుడు, హైస్కూలు కమిటీ డైరెక్టరు, లింగంపేట.

కాలువలు నిర్మించాలి



సిమ్మెంటు రోడ్లుకు మదుములు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లోఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుకు రెండువైపులా కాలువలు నిర్మించాలి. గ్రామాల్లో మురుకినీరు పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాము. సమస్యను గుర్తించి అధికారులు చర్యలు చేపట్టాలి.

- నల్లబెల్లి శ్రీనివాసు, సిపిఐ మండల కార్యదర్శి, విప్పలపాలెం.

'జన్మభూమి'లో అధికారులను నిలదీత


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కోటవురట్ల

అన్నింటా జన్మభూమి కమిటీల పెత్తనమేనా అధికారులెందుకు దండగ అని పలువురు వైసిపి, బిజెపి నాయకులు అధికారులను ప్రశ్నించారు. శనివారం మండలంలోని చౌడవాడ గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. అయితే జన్మభూమి నిర్వహించిన మూడుచోట్ల గ్రామస్థులు అభివృద్ధి ఫలాలు అర్హులకు అందడం లేదని జన్మభూమి కమిటీ సిఫార్స్ చేసిన వ్యక్తులకే దక్కుతున్నాయని నిలదీశారు. చౌడవాడ సభలో అధికార పార్టీ మిత్రపక్షమైన బిజెపి సభ్యులు ఎస్.గణేష్ మూడేళ్లుగా సొంత ఇంటికోసం దరఖాస్తులు చేస్తున్నా మంజూరు చేయడం లేదని జన్మభూమి కమిటీపై విరుచుకుపడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. గాటువాడ గ్రామంలో కాలని ఇళ్లపై రెవెన్యూ అధికారులను గ్రామస్థులు నిలదీశారు. రామచంద్రపురంలో మరుగుదొడ్డి బిల్లులు చెల్లుంపుపై వివాదం చెలరేగింది. వాస్తవవాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడవద్దంటూ ఇరువర్గాలు మధ్య తోపులాట సంభవించింది. అనంతరం గర్భిణులకు సీమంతాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వరహాలమ్మ, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, ప్రత్యేక అధికారి శ్రీధర్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ కల్యాణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో పాటు మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : గత జన్మభూమి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, సౌకర్యాల కల్పన, ఇతర సమస్యల్లో అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండలంలోని కుజ్జెలి, తుంపాడ, ఐనాడ పంచాయతీలోని జన్మభూమి అధికారులను స్థానిక గిరిజనులు నిలదీశారు. కుజ్జెలి నుంచి దిగుమోదాపుట్టు వరకు రహదారి అధ్వానంగా ఉందని, మోదాపుట్టు, కుజ్జెలి, రాములపుట్టు గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు అందించాలని కుజ్జెలి సర్పంచ్ జి.చిట్టిబాబు ఆధ్వర్యాన గిరిజనులు అధికారులను ప్రశ్నించారు. గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలను సైతం నేటికీ పరిష్కరించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐనాడ, తుంపాడ గ్రామసభల్లో కూడా గిరిజనులు అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. సమస్యలు పరిష్కరించనప్పుడు మళ్లీ జన్మభూమి నిర్వహించి సమస్యలెందుకు అడుగుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నూకరత్నం, టిడిపి జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షులు బొర్రా నాగరాజు, తహశీల్దార్ దుర్గారవీంద్రనాథ్, ఎంపిడిఓ మధుమోహన్‌కుమార్, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే 'జన్మభూమి'

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్

అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం జన్మభూమి మా ఊరు కార్యక్రమం చేపట్టిందని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. నర్సీపట్నం మండలము గురంధ్ర పాలెం గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మహాలక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా పింఛన్లు, రేషన్ కార్డులు రానివారు ఉంటే ఈ జన్మభూమిలో దరఖాస్తులో చేసుకోవాలని సూచించారు. సుకల రమణమ్మ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక టిడిపినే అని చెప్పారు. లబ్ధిదారులకు 27 రేషన్ కార్డులు, పింఛన్ల 14, 64 స్కాలర్షిప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జయ మాధవి, ఎంఆర్‌ఓ వి.వి రమణ, ఎంపిటిసి రాయి శివలక్ష్మి కుమారి, సర్పంచ్ సేనాపతి వెంకటరత్నం, ఇఒపిఆర్‌డి సిహెచ్ ప్రేమలీల, తెలుగు ఎపిఎం సత్తిబాబు, వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాతవరం : అర్హులైన వారికి సంక్షేమాలు అందించడమే జన్మభూమి ఉద్దేశమని జిల్లా పంచాయితీ అధికారి వి.కృష్ణకుమారి అన్నారు. శనివారం మండలంలోని వి.బి అగ్రహారం, ఎస్,బి పట్నం పెద జగ్గంపేట, మన్యఉరట్ల గ్రామాలల్లో జన్మభూమి కార్యాక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పంచాయితీ అధికారి మాట్లాడుతూ డ్వాక్రాల ద్వారా 35 కుటంబాలకు 1 సాదకరత మిత్రలుంటారని చెప్పారు. సర్పంచ్ వనిమిన సుర్యారావు మాట్లాడుతూ హైస్కూల్‌కు ఆట స్థలం కావాలని, ఉపాధ్యాయుల కొరత తీరాలని అదికారులను కోరారు. ఈ కార్యాక్రమంలో తహశీల్దార్ కనకారావు, ఎంపిపి సింగంపల్లి సన్యాసిదేముడు, వైస్ ఎంపిపి చిట్టిబాబు, పార్టీ ప్రసిడెంట్ వనిమిన సాంభమూర్తి, హస్పటల్ అభివృద్ధి అధికారి కాశపు అప్పారావు, సంస్కృతిక విభాగ అధ్యక్షులు కనక గిరిశంకర్ నారాయణ, దేవాలయం చైర్మెన్ దివానం, ప్రాదానోపాద్యాయులు ఎస్‌విఎస్ శివ ప్రసాద్, చైర్మెన్ సత్తిబాబు పాల్గున్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత

గొలుగొండ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం జన్మభూమి-మాఊరు కార్యక్రమం చేపట్టిందని జన్మభూమి నియోజకవర్గ ప్రత్యేకఅధికారి జి.శేఖరబాబు అన్నారు. శనివారం మండలంలో పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట, పాకలపాడు గ్రామాల్లో జన్మభూమి-మాఊరు సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమపథకాలను ఈ కార్యక్రమం ద్వారా అర్హులకు అందిస్తామన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు కలసి సామూహిక సీమంతం చేశారు. ఈ సభలవద్ద వైద్యశిబిరం, పౌష్టికాహారా స్టాల్స్, ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బెల్లపు రాజులమ్మ, కె. పెదరాజులమ్మ, కామిరెడ్డి రామన్న, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసు, ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ, జెడ్‌పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సుర్ల బాబ్జి, ఎమ్డీఓ సువర్ణరాజు, ఐసిడిఎస్ పిఓ శ్రీకళ. టిడిపి మండల యూత్ అధ్యక్షులు బెల్లపు కొండలరావు, ఎంఇఓ జి. నాగేంద్ర, తహశీల్దారు అంబేద్కర్, ఇఒపిఆర్‌డి త్రిమూర్తులుతో పాటుగా పలువురు మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నర్సీపట్నం : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అని అన్నారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. అర్హులైన పేదలకు పింఛనులు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తారన్నారు. అనంతరం గర్భిణులకు ఆమె ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. అలాగే చంద్రన్న బీమా చెక్కులు, చంద్రన్న కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జె.సురేంద్ర, డిఇఇ రంగ కామేశ్వరరావు, కౌన్సిలర్లు జాలుమూరి వెంకట బంగార్రాజు, గవిరెడ్డి బెన్నయ్య నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

సిపిఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నంలో సిపిఐ 23వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులు శనివారం సిపిఐ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కమిటీ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాల్లేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గసభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, పట్టణ కార్యదర్శి రుత్తల పెదబుజ్జి మాట్లాడుతూ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. కర్షక, కార్మిక, పారిశుద్ధ్య అనేక సమస్యలు మహాసభలో తీర్మానం చేసి, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్థ సభ్యులు గూరుబాబు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శివలేంక కొండలరావు, పి తాతబ్బాయి, కమిటీ సభ్యుడు ఎం అప్పలరాజు, రెడ్డి రాజబాబు రెడ్డి రామలక్ష్మి, కామారెడ్డి సూర్య వతి, ఎన్ శ్రీను, ఎర్రన్నాయుడు మహిళా సంఘం జిల్లా నాయకులు భవాని తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి పూర్వ విద్యార్థుల సహకారం

నర్సీపట్నం : సుమారు రూ.6 లక్షలతో నిర్మించిన మరుగుడ్లను పెదబొడ్డేపల్లి ఆర్‌సిఎం హైస్కూల్‌లో 1983-84లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రదీప్, గాబ్రియేల్ మాస్టార్ మాట్లాడుతూ, ఇక్కడ చదువుకున్న 1983,-84 బ్యాచ్ విద్యార్థులు బాలికల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మించారని, 1988-89 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు బాలురుల కోసం టాయిలెట్స్ నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ నెల 18న ఈ బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక పాఠశాల ఆవరణలో నిర్వహించుకోవడానికి అనుమతించామన్నారు. అనంతరం ఫాదర్ ప్రదీప్‌కు అప్పటి పాఠశాల ఉపాధ్యాయులు ఎబి.శంకరం చేతుల మీదుగా తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రిటైర్డు ఉపాధ్యాయులు చిటికెల ఆనందరావు, ఎబి.శంకరం, ఎస్.పాపారావు, ప్రభాకర్, గండేపల్లి అప్పారావు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామకృష్ణ, పాఠశాల పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

జన్మభూమిలో వినతుల వెల్లువ

రోలుగుంట : మండలంలోని కె.నాయుడుపాలెం, కొవ్వూరు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. గ్రామస్తులు సమస్యలు పరిష్కరించాలని సిఇఓ ఆర్.జయప్రకాష్ నారాయణకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శచీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గన్నారు.

పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ

ప్రజాశక్తి - నాతవరం

మండలంలో పి.కె గూడెం గ్రామంలో విశాఖ డైరీ సభ్యులు సూమారు 51 మంది రైతులకు శనివారం రూ.74,750 భోనస్‌లుగా పంపీణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అద్యాక్షులు గొంప స్వామినాయుడు మాట్లాడుతూ భోనస్‌లను సద్వీనీయోగం చేసుకోవాలన్నారు. అదే విదంగా అర్హులైన రైతులకు ఆవు పెయ్యలు, గేదె పడ్డలు డైరీ ద్వారా సరఫరా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖడైరీ రూటు సూపర్ వైజర్ జి.శ్రీనుబాబు, మహష్, పిఎస్ రమణమూర్తి పాల్గొన్నారు.


బోనస్‌లు అందిస్తున్న స్వామినాయుడు

డిసిఐ ప్రయివేటీకరణ నిలిపేయకుంటే పోరాటం ఉధృతం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి- డాబాగార్డెన్స్

డిసిఐను ప్రయివేటీకరించాలన్న నిర్ణయాన్ని ఈ నెల 20లోపు ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు డాక్టర్ హేమలత హెచ్చరించారు. విశాఖ నగరంలోని సీహార్స్ కూడలిలో ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, డిసిఐ ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఇటీవల నిర్వహించిన ప్రజాబ్యాలెట్‌లో 1,01,320 ఓట్లు పోలవ్వగా 1,00,090 ఓట్లు డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగాను, 612 ఓట్లు మాత్రమే అనుకూలంగా వచ్చాయన్నారు. 618 ఓట్లు చెల్లలేదన్నారు. ప్రయివేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ప్రజల గౌరవాన్ని ప్రభుత్వం కాపాడాల్సిన అవసరముందని తెలిపారు. బిజెపి ప్రభుత్వరంగ పరిశ్రమలను డిజిన్వెస్టుమెంట్ చేయడానికి ఏకంగా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సేలం, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్‌లు, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను మొత్తంగా ప్రయివేటుపరం చేయడానికి పూనుకుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టడం వల్ల ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వానికి పన్నులు, డివిడెంట్లు చెల్లిస్తున్నాయన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుపరం చేయడమేనా బిజెపి దేశభక్తి అని ప్రశ్నించారు. మేకిన్ ఇండియా, సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో ప్రకటించి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న జగ్గునాయుడు, చిత్రంలో హేమలత, పద్మనాభరాజు, కుమార్ తదితరులు

ప్రభుత్వరంగమంటే ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు వస్తాయని దేశ సార్వభౌమత్వం కాపాడబడుతుందని తెలిపారు. రైల్వే ప్రయివేటీకరణభాగంగా ఇప్పటికే విశాఖ, విజయవాడ, హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబయి వంటి 43 రైల్వేస్టేషన్లను ప్రయివేటీకరణ చేశారన్నారు. రైల్వే ఇంజన్లు, బోగీలు తయారు చేయడం ప్రభుత్వరంగంలో జరుగుతుందని, వాటిని ప్రయివేటుపరం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ డిసిఐ పరిరక్షణకు ఉద్యోగులు చేస్తున్న పోరాటం, అఖిలపక్ష కార్మికసంఘాలు, రాజకీయపార్టీలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఎఫ్ఎస్‌యు జాతీయ నాయకులు మనోజ్‌యాదవ్, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు కె.ఈశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మార్కెండేయులు, ఐఎఫ్‌టియు నాయకులు మల్లయ్య, ఢిపెన్స్ నాయకులు ఆర్.వెంటకరావు, డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు, జనసేన నాయకులు శివప్రసాద్, గోపి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కెఎం.శ్రీనివాస్, ఇన్సూరెన్స్ నాయకులు ఆర్.రమణాచలం, ఐద్వా నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వి.నర్సింగరావు, వెంకటరావు, మూర్తి, డిసిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు హనుమాన్ నాయక్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు డాక్టర్ బి.గంగారావు, పి.వెంకటరెడ్డి, జిఎస్.రాజేశ్వరరావు, బి.జగన్, పి.మణి, ఎం.సుబ్బారావు, డి.అప్పలరాజు, వై.రాజు, జి.అప్పలరాజు, డి.అప్పలరాజు, టి.పైడిరాజు, ఒ.అప్పారావు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో రెప్కో బ్యాంకు ప్రదర్శన

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

ఆంధ్రాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో రెప్కో బ్యాంకు ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. బ్యాంకు అందిస్తున్న రుణాలు, డిపాజిట్‌కు సంబంధించిన వివిధ పథకాలను ప్రదర్శిచారు. వీటిని సందర్శకులకు అర్ధమయ్యే రీతిలో వివరించేందుకు ఉద్యోగులను ఏర్పాటు చేశారు. దీంతో సందర్శకులు రెప్కోబ్యాంకు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రదర్శన ఆదివారంతో ముగిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

డిగ్రీ కాలేజిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - యలమంచిలి

జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా యలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళా సాధికార సెల్ కో ఆర్డినేటర్ కె.పద్మ, కె.రామయ్య ఆధ్వర్యాన వీటిని నిర్వహించారు. లెక్చరర్లు మంజుల, మహాలక్ష్మి, నిర్మలాకుమారి, లక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మొదటి బహుమతి శాంతి నాగలక్ష్మి, దేవిమహాలక్ష్మి, ద్వితీయ సుధ, జ్యోతి, తృతీయ రత్నమాల, యామినిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీలను నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఆసక్తికరంగా సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీలు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- మద్దిలపాలెం

ఆంధ్ర యూనివర్సిటీ అధ్వర్యాన రఘు ఇంజనీరింగ్ కాలేజి నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. శనివారం విశాఖ, విజయనగంలలో తొమ్మిది క్రీడా మైదానాల్లో 19 మ్యాచ్‌లు జరిగాయి. క్రీడాకారులు చక్కటి ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. రఘు ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్‌లో కాకినాడ జెఎన్‌టియు, ఆచార్య నాగార్జున అగ్రికల్చర్ యూనివర్సిటీలు జరగాల్సిన పోటీలో నాగార్జున అగ్రికల్చర్ యూనివర్సిటీ జట్టు హాజరుకాలేక పోవడంతో కాకినాడ జెఎన్‌టియు జట్టుకు వాకోవర్ విజయాన్ని ప్రకటించారు. రెండో మ్యాచ్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుపై మచిలీ పట్నం కృష్ణ యూనివర్సిటీ జట్టు 107 పరుగులు తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో ఎస్‌సిఎస్‌విఎం యూనివర్సిటీపై పిఇఎస్ యూనివర్సిటీ జట్టు 18 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది.

ఎంవిజిఆర్ గ్రౌండ్‌లో మంగుళూర్ యూనివర్సిటీ, అన్నా యూనివర్సిటీలు తలపడగా అన్నా యూనివర్సిటీ జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ ఆఫ్ కరీంనగర్, గుల్బర్గా యూనివర్సిటీలు పోటీపడగా గుల్బర్గా యూనివర్సిటీ జట్టు 84 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. విజయనగరం జెఎన్‌టియులో జరిగిన మ్యాచ్‌లో కామరాజ్, రాయలసీమ యూనివర్సిటీలు తలపడగా కామరాజ్ జట్టు 5 వికెట్లు తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యోగివేమన యూనివర్సిటీపై ఉస్మానియా జట్టు 79 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది. విజ్జి గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆచార్య నాగార్జునపై చెన్నై క్రిసెంట్ యూనివర్సిటీ 7 వికెట్లు తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో అలగప్పా యూనివర్సిటీపై షిమోగ కువేంపు యూనివర్సిటీ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఎంఆర్ కాలేజి గ్రౌండ్‌లో బెంగుళూర్ యూనివర్సిటీపై యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ 46 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. మరో మ్యాచ్‌లో కర్ణాటక యూనివర్సిటీపై యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ జట్టు 6 వికెట్లు తేడాతో విజయం సాధించింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బెల్లారి విఎస్‌కె యూనివర్సిటీ జట్టుపై విజ్ఞాన్ వర్సిటీ 78 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ షిమోగపై భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ తమిళనాడు జట్టు 115 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. స్టీల్‌ప్లాంట్-2 గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో రాణి చెన్నమ్మ జట్టుపై అన్నామలై యూనివర్సిటీ జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్‌లో భారతీయార్ జట్టుపై ఎస్‌వి. యూనివర్సిటీ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సవిత యూనివర్సిటీ జట్టుపై బెంగుళూర్ అమృత విశ్వవిద్యాపీఠ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీపై డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ యూనివర్సిటీ జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. గీతం యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కాకతీయ జట్టుపై కొట్టాయాం మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గీతం యూనివర్సిటీపై విక్రమ్ సింహపురి జట్టు ఏడు పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది.

దేశం స్వయంసమృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థల కీలకపాత్ర

'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలప్ విశాఖ' పుస్తకావిష్కరణలో హేమలత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు కీలకపాత్ర పోషించాయని, అటువంటి సంస్థలను నేడు బిజెపి ప్రభుత్వం ప్రయివేటుకు అప్పగించడానికి కుట్ర పన్నుతుందని సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె హేమలత పేర్కొన్నారు. శనివారం సిఐటియు నగర కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు (ఇంగ్లీషు బుక్) రాసిన 'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలెప్ విశాఖ' పుస్తకాన్ని హేమలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతిఆయోగ్ 77 ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయాలని సిఫారసు చేయగా, మోడీ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అందులో అయిల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్‌ప్లాంట్ వంటి కంపెనీలు, బీమా సంస్థలు, రక్షణ, బ్యాంకింగ్, రైల్వే వంటి సంస్థలున్నాయన్నారు. దేశంలోని 400 పైగా రైల్వే స్టేషన్లను ప్రయివేటు చేయాలని నిర్ణయించారని, అందులో 43 స్టేషన్లకు టెండర్లు పిలిచారని, ఇప్పటికే మధ్యప్రదేశ్‌లోని హబీజ్‌నగర్ స్టేషన్‌ను ప్రయివేటుకు అప్పగించారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకునేందుకు సిఐటియు చేస్తున్న పోరాటానికి దేశభక్తులు, దేశాన్ని ప్రేమించేవాళ్లు, అభివృద్ధి కాముకులు తమ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. లేదంటే భారతదేశం భద్రతకే పెనుముప్పు ఏర్పడుతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా పాలసీ దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, ప్రయివేటుకు అప్పగించిన జింక్ పూర్తిగా మూతపడిందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలపై నగరంలోని బిజెపి నేతలను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇకనైనా బిజెపి ఈ విధానాలను మార్చుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గనులు ఇవ్వకుండా ఎండగట్టి ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమలత, చిత్రంలో నర్సింగరావు తదితరులు